S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుక.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

**7036644111, 9490140565**

సంపుటి: 19 | సంచిక: 328 | ఎడిటర్ : అలీ ముర్తుజా | ఆదివారం 25 అక్టోబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |



## గోబెల్స్‌ను మించిన బీఆర్ఎస్

- మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల వైఫల్యాలపై తప్పుడు ప్రచారం
- ఎల్‌నినో పరిస్థితులను రాజకీయాలకు వాడుకుంటున్నారు
- పదేళ్ల పాలనలో సాగునీటి రంగాన్ని సర్వనాశనం చేశారు
- బీఆర్ఎస్ నేతలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫైర్

వివరాలు 2వ పేజీలో



## అధికారుల నిర్లక్ష్యం సహించం!

- ఉపాధి పనుల అమలులో వెనుకబడితే చర్యలు
- మహిళలు రాజకీయంగా, సామాజికంగా ఎదగాలి: మంత్రి సీతక్క

2



## దేశ రక్షణలో తెలంగాణదే

# కీలక పాత్ర

**త్వరలో 'ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ 2.0'**

- రక్షణ ఉత్పత్తుల ఎగుమతుల్లో భారత్ అగ్రగామి కావాలి
- పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు



వివరాలు 2వ పేజీలో

రక్షణ రంగంలో ఆయుధాలు, సాంకేతికతను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి భారతదేశం ఎదగాలని, ఆ మహా సంకల్పంలో తెలంగాణ అతిపెద్ద 'డిఫెన్స్ ఇండస్ట్రియల్ హబ్'గా మారబోతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. పెట్టుబడిదారుల లక్ష్య సాధనలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చిన ఆయన.. తమ దార్శనికతకు అనుగుణంగా త్వరలోనే 'ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ 2.0'ను తీసుకురాబోతున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్ వేదికగా ప్రతిష్టాత్మకంగా జరిగిన 'రక్షా ఎక్స్‌పో 2026 కర్టెన్ రైజర్' ఆవిష్కరణ కార్యక్రమంలో జాతీయ, అంతర్జాతీయ రక్షణ రంగ దిగ్గజాలను ఉద్దేశించి ఆయన ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు.

- సమయం న్యూస్, హైదరాబాద్

## తుమ్మిడిహట్టిపై ముంబైలో కీలక భేటీ!

రేపు మహారాష్ట్ర సీఎంతో సీఎం రేవంత్ చర్చలు

# మళ్లీ ఢిల్లీపై గులాబీ గురి

**ఢిల్లీ రాజకీయాల్లో కీలక పాత్రపై కేటీఆర్ సంకేతాలు**

**కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా కొత్త కూటమి యత్నమా?**



- శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకేనంటున్న విశ్లేషకులు
- థర్డ్ ఫ్రంట్ ఏర్పాటులో ఆచరణాత్మక సవాళ్లే కీలకం

వరుస పరాజయాలతో ఢీలాపడిన పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే వ్యూహమో లేక నిజంగానే హస్తినపై గురిపెట్టారో కానీ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ జాతీయ రాజకీయాల వైపు చూస్తున్నారన్న చర్చ జోరందుకుంది. కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా ప్రాంతీయ పార్టీలను ఏకం చేసి ఢిల్లీలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారంటూ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. ఆచరణలో ఎన్నో సవాళ్లున్నా.. త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల వేళ కేడర్‌లో భరోసా కల్పించేందుకే గులాబీ నాయకత్వం ఈ కొత్త కూటమి అంశాన్ని తెరపైకి తెచ్చిందనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి.

3

## ఏఐ భూతం కాదు.. అవకాశాల గని



- ఉద్యోగాలు హరిస్తుందన్న భయం వద్దు
- నైపుణ్యాలు పెంచుకోవాలి
- కేటీఆర్

3

## రాజకీయాలు కాదు.. ప్రజలకు అండగా నిలవాలి!



- ఎల్‌నినో విపత్తు సమయంలో బురదజల్లడం సరికాదు
- ప్రతిపక్షాలకు హితవు పలికిన డిప్యూటీ సీఎం భట్టి
- విద్యుత్ డిమాండ్, భూగర్భ జలాల కొరతపై ఆందోళన
- ఉన్న నీటిని తాగు అవసరాలకే వాడాలని విజ్ఞప్తి

...వివరాలు 2లో



## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పక్కా!

2

- న్యాయపరమైన చిక్కులు లేకుండా అందజేస్తాం
- ఎవరూ ఆందోళన చెందొద్దు: మంత్రి పొంగులేటి

## క్లోరోఫామ్ లీకేజీ.. హెచ్ఆర్సీ సీరియస్!

**సరకా ల్యాబ్స్‌లో ఇద్దరు కార్మికుల మృతిపై సుమోటో కేసు**




3



## కాంగ్రెస్ సర్కారుపై బీజేపీ సమరశంఖం!

- కాంగ్రెస్ వైఫల్యాలపై మహా పాదయాత్రలు
- రాష్ట్ర పదాధికారుల భేటీలో కీలక నిర్ణయాలు

3

## కామన్ ఫెసిలిటీ సెంటర్!

- కరీంనగర్ జిల్లా రుక్మాపూర్‌లో చర్మ శుద్ధి కర్మాగారాలు
- జమ్మికుంట, ఆర్మూర్‌లో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లు
- ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

2





## ఎన్నికల కోసం విద్యార్థుల పోరు

4

- విద్యార్థి సంఘం పునరుద్ధరణ కోసం ఆమరణ నిరాహార దీక్షలు
- నిరసన టెంట్ల తొలగింపు ప్రయత్నంతో భద్రతా సిబ్బందితో ఘర్షణ
- 2006 నుంచి నిలిచిపోయిన విద్యార్థి సంఘం ఎన్నికలు
- క్యాంపస్‌లోకి ప్రవేశించిన కాంగ్రెస్ ఎంపీలపై రిజిస్ట్రార్ ఆరోపణలు

## ఆపరేషన్ సిందూర్.. ట్రంప్ నోట మళ్లీ అదే పాట!

- భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానంటూ ప్రకటన
- ఎనిమిది యుద్ధాలను నిలువరించానని వ్యాఖ్యలు
- శాంతి నెలకొల్పానని వెల్లడి

4





# తుమ్మిడిహట్టిపై ముంబైలో కీలక భేటీ!

**సోమవారం మహారాష్ట్ర సీఎంతో సీఎం రేవంత్ చర్చలు**

**బ్యారేజీ ఎత్తు 152 మీటర్లు ఉండాలని తెలంగాణ పట్టు**

**మంగళవారానికి కేఆర్ఎంబీ సమావేశం వాయిదా**

**హైదరాబాద్, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్రతో చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. సోమవారం ముంబైలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశం కానున్నారు. గతంలో 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించగా, దానివల్ల ఆశించిన ప్రయోజనం ఉండదని తెలంగాణ భావిస్తోంది. అందుకే 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించేలా మహారాష్ట్రను ఒప్పించడమే లక్ష్యంగా సాంకేతిక నివేదికలను ప్రభుత్వం సిద్ధం చేసింది. ముఖ్యమంత్రి ముంబై పర్యటన నేపథ్యంలో సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సమావేశం మంగళవారానికి వాయిదా పడింది. బీఆర్ఎస్ పాలనలో కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీ బీఆర్ఎస్ హయాంలోనే దెబ్బతిన్నదని విమర్శించారు. బ్యారేజీ గేట్లు మూయొద్దని ఎన్‌డీఎస్ఏ స్పష్టం చేసిందని, అలాంటప్పుడు పంపుల ద్వారా నీటిని ఎలా ఎత్తిపోస్తామని ఆయన బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. ఎల్‌నినో పరిస్థితుల్లో తలెత్తిన ఇబ్బందులకు గత ప్రభుత్వ విధానాలే కారణమని ఆయన ఆరోపించారు

# గోబెల్స్‌ను మించిపోయిన బీఆర్ఎస్ నేతలు!

**మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల వైఫల్యాలపై తప్పుడు ప్రచారం**

**ఎల్‌నినో పరిస్థితులను రాజకీయాలకు వాడుకుంటున్నారు**

**పదేళ్ల పాలనలో సాగునీటి రంగాన్ని సర్వనాశనం చేశారు**

**బీఆర్ఎస్ నేతలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫైర్**

**హైదరాబాద్, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యాలను కప్పిపుచ్చుకుంటూ, ఎల్‌నినో పరిస్థితులను సైతం తమ రాజకీయాలకు వాడుకునేందుకు బీఆర్ఎస్ నేతలు తీవ్ర దుష్ప్రచారం



చేస్తున్నారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల ప్రచారం హిట్లర్ మంత్రి గోబెల్స్‌ను మించిపోయిందని విమర్శించారు. సచివాలయంలో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేశారని, కల్వకుర్తి, నెట్టెంపాడు, ప్రాణహిత తదితర ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి ఉంటే ప్రస్తుత కరువు పరిస్థితుల్లో రైతులకు ఈ కష్టాలు తప్పేవని అన్నారు. అవినీతి, అనాలోచిత నిర్ణయాలు, పేలవమైన డిజైన్ల వల్లే మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్నదని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) తేల్చిందని స్పష్టం చేశారు.

**మూడు బ్యారేజీలు లేకుండానే రికార్డు సాగు..**

ఎన్డీఎస్ఏ సూచనల మేరకే మూడు బ్యారేజీల గేట్లను ఎత్తి ఉంచామని మంత్రి తెలిపారు. అయితే ఆ మూడింటిని వాడుకోకుండానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో రికార్డు స్థాయిలో వరి సాగు, ధాన్యం కొనుగోళ్లు సాధించామని ఆయన గుర్తుచేశారు. ఈ బ్యారేజీల పునరుద్ధరణపై తమకు ఎలాంటి రాజకీయ దురుద్దేశాలు లేవని, జాతీయ, అంతర్జాతీయ నిపుణుల సలహాలతో పనులు ముందుకు తీసుకెళ్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో మంత్రి వివేక్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు పక్కా!

**న్యాయపరమైన చిక్కులు లేకుండా అందజేస్తాం**

**ఎవరూ ఆందోళన చెందొద్దు: మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** రాష్ట్రంలో కొన్నేళ్లుగా ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్న జర్నలిస్టుల కలను తమ ప్రజా ప్రభుత్వం కచ్చితంగా నెరవేరుస్తుందని రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. చట్టపరమైన చిక్కులు లేకుండా, నివాసయోగ్యమైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 2008లో వైఎస్సార్ హయాంలో స్థలాలు కేటాయించగా సుప్రీంకోర్టు కేసుల వల్ల ఆగిపోయిందన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు తుది తీర్పుతో ఎదురైన న్యాయపరమైన అడ్డంకులకు శాశ్వత పరిష్కారం చూపేలా సీఎం రేవంత్‌తో చర్చించామన్నారు. ఎవరూ ఆందోళన చెందొద్దని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే జర్నలిస్టులకు స్థలాలు ఇచ్చిందని.. మళ్లీ కాంగ్రెస్ పాలనలోనే ఇస్తామని భరోసా ఇచ్చారు.

**రూ.150 కోట్లతో కరువు నివారణ..**

రాష్ట్రంలో కరువు పరిస్థితులను తట్టుకునేలా మూడు మండలాల్లో రూ.150 కోట్లతో శాశ్వత నివారణ చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. శనివారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్, నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునూతల, నారాయణపేట జిల్లా మక్తల్ మండలాలను ఇందుకు ఎంపిక చేసినట్లు చెప్పారు. జాతీయ విపత్తుల నిర్వహణ నిధి (ఎన్‌డీఎఫ్) సహకారంతో చేపట్టే ఈ ప్రాజెక్టును పక్కాగా అమలు చేయాలన్నారు. ఖర్చు చేసే ప్రతి రూపాయి పేదలు, రైతులకు చేరేలా పారదర్శకంగా పనులు జరగాలని అధికారులను ఆదేశించారు.

# దేశ రక్షణలో తెలంగాణదే కీలకపాత్ర!

- **రక్షణ ఉత్పత్తుల ఎగుమతుల్లో భారత్ నెంబర్ వన్ కావాలి**
- **లక్ష్య సాధనలో పూర్తి సహకారం నాది..**
- **రక్షా ఎక్స్‌పో కర్టెన్ రైజర్‌లో సీఎం రేవంత్ రెడ్డి పిలుపు**

**హైదరాబాద్, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** రక్షణ రంగంలో భారతదేశాన్ని ప్రపంచంలోనే శక్తివంతమైన అగ్రగామి దేశంగా తీర్చిదిద్దేందుకు పారిశ్రామికవేత్తలంతా కలిసి రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. 'తెలంగాణ రైజింగ్ 2047' దార్శనికతకు అనుగుణంగా రాష్ట్రంలో త్వరలోనే 'ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ 2.0'ను తీసుకురాబోతున్నట్లు ఆయన వెల్లడించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా హైదరాబాద్‌లోని తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'రక్షా ఎక్స్‌పో 2026 కర్టెన్ రైజర్'ను ప్రారంభించి, లోగోను ఆవిష్కరించారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

**దిగుమతుల నుంచి.. ఎగుమతుల స్థాయికి..**

రక్షణ రంగంలో భారత్‌ను ప్రపంచ స్థాయిలో అగ్రగామిగా చూడాలన్నదే తన ఆకాంక్ష అని సీఎం పేర్కొన్నారు. యుద్ధానికి అవసరమైన సాంకేతికతను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే స్థాయి నుంచి.. స్వావలంబన సాధించడంతో పాటు సాంకేతికతను ఎగుమతి చేసే దేశంగా భారత్ ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ లక్ష్య సాధనలో తెలంగాణ గణనీయమైన పాత్ర పోషిస్తోందన్నారు. దేశ రక్షణ రంగ పరిశ్రమకు తెలంగాణ అతిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా (హబ్) ఎదగాలని, అందుకు అందరి సహకారం అవసరమని సీఎం కోరారు. "రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని మీరు వేసుకున్న ప్రణాళికలను రెట్టింపు చేయండి. మీ లక్ష్య సాధనకు నా నుంచి ఎలాంటి సహకారం కావాలో చెప్పండి.. సహకరించడానికి నేను సిద్ధంగా ఉన్నా. ఇది నా హామీ" అని పారిశ్రామికవేత్తలకు స్పష్టం చేశారు.

**2047 నాటికి పది శాతం వాటా..**

రాష్ట్ర రక్షణ రంగంతో పాటు ఏరోస్పేస్, స్పేస్, సైబర్ సెక్యూరిటీ, డ్రోన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) వంటి అనుబంధ రంగాల్లో పారిశ్రామికవేత్తలు లక్ష్యాలను సాకారం చేయాలని సీఎం కోరారు. గతేడాది విడుదల చేసిన 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌లో భాగంగా.. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. దేశ జనాభాలో తెలంగాణ వాటా 2.5 శాతంగా ఉందని, దేశ స్థూల జాతీయోత్పత్తిలో 5 శాతం వాటాను అందిస్తోందని.. దీన్ని 2047 నాటికి 10 శాతానికి పెంచడమే తన లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. ఈ దార్శనికత సాకారంలో రక్షా ఎక్స్‌పో ప్రధాన వేదికగా మారుతుందన్నారు. ఈ రంగంలో వినూత్న ఆలోచనలు, సరికొత్త సాంకేతికతను తీసుకురావాలని.. అందుకు అనువైన వాతావరణాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో యుద్ధ స్వరూపం పూర్తిగా మారనుందని, డ్రోన్లు, రోబోలు, కృత్రిమ మేధతో పనిచేసే వ్యవస్థలు యుద్ధ రంగాన్ని మార్చబోతున్నాయని గుర్తుచేశారు.

**అత్యంత వ్యూహాత్మక కేంద్రం హైదరాబాద్!**

భారత రక్షణ వ్యవస్థలో హైదరాబాద్ అత్యంత వ్యూహాత్మకమైన, సురక్షితమైన నగరమని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ఎన్నో ప్రతిష్టాత్మక పరిశోధనా సంస్థలకు ఇది నిలయమని, ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన కీలక వ్యూహాత్మక కేంద్రాలు ఇక్కడి నుంచే పనిచేస్తున్నాయన్నారు. దక్షిణ భారతదేశంలో సముద్ర తీరం లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ అయినప్పటికీ.. నౌకాదళానికి సైతం కీలక సేవలు అందిస్తోందని, వికారాబాద్ జిల్లా దామగుండంలో నిర్మిస్తున్న అత్యంత తక్కువ పౌనఃపున్యాల (వీఎల్ఎఫ్) రాడార్ కేంద్రమే ఇందుకు నిదర్శనమని వివరించారు. వచ్చే డిసెంబర్



7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో మరింత భారీ స్థాయిలో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'లో పాల్గొనాలని ప్రతినిధులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో దేశ, విదేశీ రక్షణ, అంతరిక్ష సంస్థల ప్రతినిధులు విశేషంగా పాల్గొన్నారు. డీఆర్డీవో, హెచ్ఏఎల్, బీడీఎల్, మిధాని, టాటా, ఎయిర్‌బస్, సాఫ్రాన్, స్కైరూట్, లాక్‌హీడ్ మార్టిన్, భారత్ ఫోర్జ్ వంటి ప్రముఖ సంస్థలకు చెందిన వారు హాజరయ్యారు. అమెరికా కాన్సులేట్ జనరల్ (హైదరాబాద్) లారా విలియమ్స్, భారత్ ఫోర్జ్ సీఎండీ బాబా కల్యాణి, స్కైరూట్ సీఈఓ పవన్ కుమార్ చందన, డీఆర్డీవో మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి, లాక్‌హీడ్ మార్టిన్ హెడ్ మైకెల్ ఫెర్నాండెజ్, ఎల్ అండ్ టీ ప్రతినిధి అరుణ్ రాంచందాని, ధ్రువ స్పేస్ కో–ఫౌండర్ సంజయ్ నెక్కంటి, సాఫ్రాన్ సీఈఓ జితేంద్ర గవాంకర్, ఎయిర్‌బస్ డిఫెన్స్ స్పేస్ ప్రెసిడెంట్ వెంకట్ కట్కూరిలతో పాటు రక్షణ శాఖ సీనియర్ అధికారులు, మాజీ ఉన్నతాధికారులు, రాష్ట్ర హోం శాఖ కార్యదర్శి శిఖా గోయల్ పాల్గొన్నారు. రక్షణ రంగానికి చెందిన భాగస్వాములందరినీ ఒకే వేదికపైకి తెచ్చి పరస్పరం చర్చించుకునేలా రక్షా ఎక్స్‌పోను ఒక అంతర్జాతీయ వేదికగా తీర్చిదిద్దాలన్నదే తన ఆలోచన అని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

# అధికారుల నిర్లక్ష్యం సహించం!

- **ఉపాధి పనుల అమలులో వెనుకబడితే చర్యలు**
- **అర్హులకు వెంటనే జాబ్ కార్డులు మంజూరు చేయాలి**
- **మహిళలు రాజకీయంగా, సామాజికంగా ఎదగాలి: మంత్రి సీతక్క**

**హైదరాబాద్, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** ఉపాధి హామీ పనుల విషయంలో అధికారుల నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించేది లేదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) హెచ్చరించారు. శనివారం ఆమె ఉపాధి హామీ పథకం అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనులు ప్రారంభించని డీఆర్‌డీఓలు, జాబ్ కార్డులు ఇవ్వడంలో జాప్యం చేస్తున్న ఎంపీడీఓలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నవంబర్ 1 నాటికి క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించాలని, స్థానిక అవసరాలకు తగినట్లుగా పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాల ప్రహరీలు, కమ్యూనిటీ హాళ్లు తదితర నిర్మాణాలను వేగవంతం




చేయాలన్నారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఎనిమిది నెలల సమగ్ర కార్యాచరణను రూపొందించాలని సూచించారు. కాలువల మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**జర్నలిస్టులకు రక్షణ ఏదీ?**

అధికారాన్ని ప్రశ్నించే మహిళా జర్నలిస్టులను శత్రువులుగా చూడటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని మంత్రి సీతక్క ఆందోళన వ్యక్తం చేశారు. బేగంపేటలో నిర్వహించిన నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఉమెన్ జర్నలిస్ట్స్ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీజేపీ, ఆర్ఎస్ఎస్ అధికారంలో ఉన్న సందర్భాల్లో మహిళల భద్రతపై దాడులు పెరుగుతున్నాయని విమర్శించారు. నిరసనలను కవర్ చేస్తున్న మహిళా జర్నలిస్టులపై దాడులు జరగడం దారుణమన్నారు. వారిపై నమోదైన కేసులను నిష్పక్షపాతంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా జర్నలిస్టులు ఐక్యంగా నిలబడాలని పిలుపునిచ్చారు.

**పట్టుదలతో ముందుకు సాగాలి..**

మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగి అన్ని రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు. మహిళలు రాజకీయాల్లో ఎదిగే క్రమంలో ఎదురయ్యే అడ్డంకులకు భయపడొద్దని సూచించారు. మాదాపూర్‌లో 'మహిళా రాజకీయ నాయకత్వం' అంశంపై జరిగిన సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని తాను ఈ స్థాయికి వస్తానని ఎన్నడూ ఊహించలేదన్నారు. ప్రజలతో సంబంధం లేకుండా నాయకుడు రాజకీయంగా నిలబడలేడన్నారు. మహిళలు ఎంత ఉన్నత స్థానాలకు చేరినా వివక్ష ఎదుర్కోవాల్సి వస్తోందని, అయినా అంకితభావం, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు



# గచ్చిబౌలిలో కామన్ ఫెసిలిటీ సెంటర్!

**లెదర్ ఇండస్ట్రీ, ఎస్సీ పారిశ్రామికవేత్తల ప్రోత్సాహమే లక్ష్యం**

**ఉన్నతస్థాయి సమీక్షలో మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి**

**హైదరాబాద్, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** రాష్ట్రంలో లెదర్ ఇండస్ట్రీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఔత్సాహిక ఎస్సీ యువతను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించేందుకు గచ్చిబౌలిలో ప్రత్యేకంగా 'కామన్ ఫెసిలిటీ సెంటర్' (సీఎఫ్‌సీ) ఏర్పాటు చేయనున్నట్లు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. శనివారం సచివాలయంలో టీజీఎల్ఐపీసీ ఉన్నతాధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అంతర్జాతీయ హంగులతో గచ్చిబౌలిలో హబ్ అండ్ స్పోక్ విధానంలో మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా రాష్ట్రంలోని ఆర్టిజన్ల ఉత్పత్తులకు అదనపు విలువ (వాల్యూ యాడెడ్) జోడిస్తామని, డిజైనింగ్ మొదలు బ్రాండింగ్ వరకు వారికి మార్గనిర్దేశం చేస్తామని మంత్రి వివరించారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో సుమారు వెయ్యి మందికి ఉపాధి కల్పించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యావరణహిత చర్మ శుద్ధి కర్మాగారాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి చెప్పారు. హుజురాబాద్ నియోజకవర్గం పరిధిలోని జమ్మికుంటతో పాటు ఆర్మూర్‌లో ఎంఎస్ఈసీడీపీ కింద ప్లగ్ అండ్ ప్లే విధానంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను అందుబాటులోకి తెస్తామన్నారు. గతంలో లిడ్‌క్యాప్‌కు ఎక్కడెక్కడ భూములు కేటాయించారు? వాటి ప్రస్తుత పరిస్థితి ఏమిటనే దానిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

# ప్రజలకు అండగా నిలవాలి!

- **ఎల్‌నినో విపత్తు సమయంలో బురదజల్లడం సరికాదు**
- **ప్రతిపక్షాలకు హితవు పలికిన డిప్యూటీ సీఎం భట్టి**
- **విద్యుత్ డిమాండ్, భూగర్భ జలాల కొరతపై ఆందోళన**
- **ఉన్న నీటిని తాగు అవసరాలకే వాడాలని విజ్ఞప్తి**

**హైదరాబాద్, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** రాష్ట్రం ఎల్‌నినోతో తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న తరుణంలో ప్రతిపక్షాలు బురదజల్లే రాజకీయాలు మాని, ప్రజలకు అండగా నిలవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హితవు పలికారు. శనివారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కరోనా సమయంలో ప్రధాని మోదీ పిలుపుకు ప్రజలు స్పందించి ప్రభుత్వాలకు అండగా నిలిచారని, ఇప్పుడు కూడా అలాగే సమష్టిగా విపత్తును ఎదుర్కోవాలన్నారు. బురదజల్లే రాజకీయాల కన్నా మంచి సలహాలు ఇవ్వాలని ప్రతిపక్షాలకు సూచించారు.

**విద్యుత్ డిమాండ్ 20,018 మెగావాట్లకు..**

రాష్ట్రంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగిందని, గతంలో 6,648 మెగావాట్లు ఉన్న గరిష్ఠ డిమాండ్ ఇప్పుడు 20,018 మెగావాట్లకు చేరిందని భట్టి వివరించారు. ఎండల తీవ్రతతో ఇళ్లు, వ్యవసాయం, లిఫ్ట్ ఇరిగేషన్లలో విద్యుత్ వాడకం పెరిగిందన్నారు. మరోవైపు జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడంతో జల విద్యుత్ ఉత్పత్తి కూడా తగ్గుతోందని



ఆందోళన వ్యక్తం చేశారు. డిమాండ్‌ను తట్టుకునేందుకు ముందస్తు ప్రణాళికలతో కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణాలు వేగవంతం చేశామన్నారు.

**నీటిని పొదుపుగా వాడాలి..**

రాష్ట్రంలో ఉన్న 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లలో సగానికి పైగా భూగర్భ జలాల కొరతతో ఉన్నాయని భట్టి వెల్లడించారు. నీరు లేని బోర్లలో మోటార్లు ఆన్ చేయొద్దని, అలా చేస్తే కాలిపోవడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడుతుందని రైతులను హెచ్చరించారు. రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి మట్టాలు దారుణంగా పడిపోయాయని, ఉన్న నీటిని వ్యవసాయం కంటే తాగునీటికే ప్రాధాన్యమిచ్చి పొదుపుగా వాడుకోవాలని కోరారు. వ్యవసాయం తగ్గితే గ్రామీణ కూలీలు, రైతులకు ఉపాధి కల్పించేలా ఉపాధి హామీ పథకం కింద 9.1 లక్షల పనులను గుర్తించామని, మరో ఎనిమిది లక్షల పనుల గుర్తింపునకు చర్యలు చేపట్టామని భరోసా ఇచ్చారు. విపత్తు వేళ ప్రభుత్వ యంత్రాంగం, ప్రజలు సమష్టిగా పని చేయాలని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు.

# మళ్లీ ఢిల్లీపై గులాబీ గురి

- ఢిల్లీ రాజకీయాల్లో కీలక పాత్రపై కేటీఆర్ సంకేతాలు
- కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా కొత్త కూటమి యత్నమా?
- శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకేనంటున్న విశ్లేషకులు
- థర్డ్ ఫ్రంట్ ఏర్పాటులో ఆచరణాత్మక సవాళ్లే కీలకం



**హైదరాబాద్, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** ప్రస్తుతం తెలంగాణ రాజకీయాలకే పరిమితమైన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) మళ్లీ జాతీయ రాజకీయాలపై దృష్టి సారిస్తోందా? పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఢిల్లీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించనున్నారంటూ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. తెలంగాణ భవన్‌లో అంబర్‌పేట నియోజకవర్గ నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పరిస్థితి, కాంగ్రెస్ నాయకత్వంపై విమర్శలు చేస్తూనే దేశ రాజకీయాల్లో ప్రత్యామ్నాయ శక్తులకు మంచి అవకాశాలున్నాయని అభిప్రాయపడ్డారు. దీంతో గులాబీ దళపతి మరోసారి హస్తిన రాజకీయాల వైపు అడుగులు వేస్తారా అన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

## ప్రాంతీయ పార్టీలతో కొత్త కూటమి?

గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి సొంతంగా మెజారిటీ రాకపోవడంతో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల మద్దతుతో కేంద్ర ప్రభుత్వం కొనసాగుతోంది. మరోవైపు ఇండియా కూటమిలోనూ వివిధ అంశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయంగా ప్రాంతీయ పార్టీలను ఏకం చేసే దిశగా కేసీఆర్ మళ్లీ పావులు కదుపుతారా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. గతంలోనూ ఆయన ఇలాంటి ప్రయత్నాలు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు. ఇప్పుడు సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, బిజూ జనతాదళ్, జేడీఎస్, వైఎస్సార్‌సీపీ వంటి పార్టీలతో సమన్వయం సాధించడం సాధ్యమేనా అన్నది కీలకంగా మారింది. అయితే ఆయా పార్టీలతో కేసీఆర్ చర్చలు జరుపుతున్నట్లు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక సమాచారం లేదు.

## కేడర్‌లో భరోసా నింపే వ్యూహమా?

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, పలువురు ఎమ్మెల్యేలు పార్టీని వీడటంతో బీఆర్ఎస్ ప్రస్తుతం రాజకీయ సవాళ్లను ఎదుర్కొంటోంది. రాబోయే ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం గులాబీ నాయకత్వానికి అత్యంత ముఖ్యంగా మారింది. కార్యకర్తల్లో ఉన్న సందిగ్ధతను తొలగించి, కేసీఆర్ నాయకత్వంపై భరోసా పెంచే వ్యూహంలో భాగంగానే జాతీయ రాజకీయాల అంశాన్ని తెరపైకి తెచ్చారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

## ఆచరణలో ఎన్నో సవాళ్లు..

జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయ కూటమి (థర్డ్ ఫ్రంట్) ఏర్పాటు చేయడం మాటల్లో సులభమైనా ఆచరణలో అనేక సవాళ్లున్నాయి. ఆయా ప్రాంతీయ పార్టీల రాష్ట్ర ప్రయోజనాలు, కేంద్రంతో సంబంధాలు, ఉమ్మడి నాయకత్వంపై ఏకాభిప్రాయం కుదరడం అంత తేలిక కాదు. మరోవైపు బీఆర్ఎస్ జాతీయ రాజకీయాలపై చేస్తున్న వ్యాఖ్యలను కాంగ్రెస్ నేతలు తప్పుబడుతున్నారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని, ముందు రాష్ట్రంలో పార్టీని కాపాడుకోవాలని ఎద్దేవా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ నిజంగానే హస్తిన బాట పట్టి కొత్త కార్యాచరణ ప్రకటిస్తారా? లేక రాష్ట్రంలో పార్టీ పునరుద్ధరణపైనే దృష్టి పెడతారా? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది

# ఏఐ భూతం కాదు.. అవకాశాల గని!

**ఉద్యోగాలు హరిస్తుందన్న భయం వద్దు**

**మారుతున్న కాలానికి అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలి**

**ఏఐతో కొత్త స్టార్టప్‌లు, భారీగా ఉపాధి మార్గాలు**

**రాండమ్ ట్రీస్ సంస్థను ప్రారంభించిన కేటీఆర్**



**హైదరాబాద్, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను దోగాలు హరించే భూతంలా కాకుండా, కొత్త అవకాశాలు సృష్టించే వేదికగా చూడాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ యువతకు పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లో డేటా, ఏఐ ఇన్నోవేషన్ సంస్థ 'రాండమ్ ట్రీస్' భారత ప్రధాన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో బ్యాంకింగ్ రంగంలో కంప్యూటర్లు వచ్చినప్పుడు తీవ్రంగా వ్యతిరేకించారని, కానీ అవే కాలక్రమేణా లక్షలాది ఉద్యోగాలకు మార్గం సుగమం చేశాయని గుర్తుచేశారు. ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయనే ఆందోళన వీడి, కొత్త నైపుణ్యాలను (అప్‌స్కిల్లింగ్, రీస్కిల్లింగ్) నేర్చుకుంటూ ప్రపంచ పోటీలో ముందుండాలని సూచించారు.

## వసతులు కల్పిస్తేనే ప్రైవేట్ కొలువులు..

అందరికీ ఉద్యోగాలు ఇవ్వడం ప్రభుత్వాలకు సాధ్యం కాదని, మౌలిక వసతులు, ప్రశాంత వాతావరణం కల్పిస్తే ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు అద్భుతంగా పెరుగుతాయని కేటీఆర్ స్పష్టం చేశారు. గత పదేళ్లలో తమ ప్రభుత్వం హైదరాబాద్‌ను గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు, ఐటీ, ఏఐ పరిశోధనలకు ప్రధాన కేంద్రంగా మార్చిందని గుర్తుచేశారు. సిరిసిల్లలో 'సాగు-బాగు' కార్యక్రమం ద్వారా ఏఐ సాంకేతికతతో రైతుల పంటలకు సోకే చీడపీడలను నివారించగలిగామన్నారు. భవిష్యత్తులో స్విగ్గీ, జొమాటో, జెప్టో, బ్లింకిట్ తరహాలోనే ఏఐ ఆధారిత స్టార్టప్‌లు కూడా భారీగా కొలువులు సృష్టిస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ సర్కారుపై బీజేపీ సమరశంఖం!

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కదంతొక్కుతున్న కమలదళం
- కాంగ్రెస్ వైఫల్యాలపై రాష్ట్రవ్యాప్తంగా మహా పాదయాత్రలు
- ముంచుకొస్తున్న కరెంట్, నీటి సంక్షోభంపై పోరుబాట
- పాలమూరు నీళ్లను డిండికి తరలిస్తే సహించం: ఎంపీ డీకే అరుణ
- బీజేపీ రాష్ట్ర పదాధికారుల భేటీలో కీలక నిర్ణయాలు



**హైదరాబాద్, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, నిరంకుశ పోకడలపై క్షేత్రస్థాయిలో పోరాటాలు ఉధృతం చేయాలని భారతీయ జనతా పార్టీ నిర్ణయించింది. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు అధ్యక్షతన రాష్ట్ర పదాధికారులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశాలు జరిగాయి. ఈ భేటీలకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఇన్‌ఛార్జి సునీల్ బన్సల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా బూత్ స్థాయి నుంచి కార్యకర్తలు సమాయత్తం కావాలని రామచందర్‌రావు దిశానిర్దేశం చేశారు. ప్రజాస్వామ్య అణచివేతకు వ్యతిరేకంగా 'లోక్‌తంత్ర బచావో ఉ భీడ్‌తంత్ర హటావో' పేరిట ఉద్యమించాలని తీర్మానించారు.

## జిల్లా కేంద్రాల్లో మహా పాదయాత్రలు..

రాష్ట్రంలో రాబోయే రోజుల్లో తీవ్రమైన కరెంట్, తాగు, సాగునీటి ఎద్దడి పొంచి ఉందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతమ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం సరైన ప్రణాళికలు లేకుండా చేతులెత్తేసిందన్నారు. గత బీఆర్ఎస్ సర్కారు వనరుల దుబారా, నేటి కాంగ్రెస్ నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి దాపురించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో భారీ ఎత్తున 'మహా పాదయాత్రలు' చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

## మా రైతుల పొట్టగొడితే సహించం: డీకే అరుణ

పాలమూరు ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డికి ఆ జిల్లాపై ఏమాత్రం ప్రేమ లేదని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి నీటిని డిండి లిఫ్ట్ ద్వారా తరలించాలని చూడటం పచ్చి ద్రోహమన్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్స్ నుంచి వచ్చే ప్రతి చుక్కపై మొదటి హక్కు పాలమూరు రైతులదేనని స్పష్టం చేశారు. నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకుని, డిండి లిఫ్ట్ ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాగా, ఈ సమావేశాల్లో సహ ఇన్‌ఛార్జులు అభయ్ పాటిల్, రేఖా శర్మ, బీజేపీ శాసనసభ, మండలి పక్ష నేతలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఏవీఎన్ రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, మధుకర్‌జీ తదితరులు పాల్గొన్నారు.

# క్లోరోఫామ్ లీకేజీ.. హెచ్‌ఆర్సీ సీరియస్!

**సరకా ల్యాబ్స్‌లో ఇద్దరు కార్మికుల మృతిపై సుమోటో కేసు**

**నవంబర్ 26లోగా నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశం**

**జీవించే హక్కుకు భంగం వాటిల్లిందన్న కమిషన్**

**పరిశ్రమ మూసివేతకు పీసీబీ ఆదేశాలు**




**హైదరాబాద్, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం పారిశ్రామికవాడలోని సరకా లేబొరేటరీస్‌లో ఇద్దరు కార్మికులు మృతి చెందిన ఘటనపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ) సుమోటోగా స్పందించింది. ఈనెల 22న రాత్రి క్లోరోఫామ్ ఆవిరి లీకై కార్మికులు చనిపోయిన వార్తలను పరిగణనలోకి తీసుకున్న చైర్‌పర్సన్ జస్టిస్ షమీమ్ అక్తర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇది రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కుకు భంగం కలిగించడమేనని కమిషన్ అభిప్రాయపడింది. ప్రమాదానికి గల కారణాలు, క్షతగాత్రులకు అందుతున్న వైద్యం, పరిశ్రమలో భద్రతా ప్రమాణాలపై నవంబర్ 26లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని సంగారెడ్డి కలెక్టర్‌ను ఆదేశించింది. కాగా, కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) తనిఖీల అనంతరం ఈ పరిశ్రమ మూసివేతకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

# ఏఈఈ పరీక్షను వాయిదా వేయండి!

**ఒకే రోజున ఎస్సెస్సీ జేఈ, టీజీఎస్‌పీఎస్సీ ఏఈఈ పరీక్షలు**

**సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బహిరంగ లేఖ**

**ఒడిశా, బీహార్‌లో మార్చినప్పుడు ఇక్కడెందుకు సాధ్యం కాదు?**

**భేషజాలకు పోయి నిరుద్యోగులను బలిచేయొద్దని హితవు**



**హైదరాబాద్ (సమయం న్యూస్):** నవంబర్ 6న స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ జేఈ), రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీఎస్‌పీఎస్సీ ఏఈఈ – సివిల్) పరీక్షలు ఒకే రోజు ఉండటంతో అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఏఈఈ పరీక్ష తేదీని మార్చాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి శనివారం ఆయన బహిరంగ లేఖ రాశారు. ఇతర రాష్ట్రాల్లో ఎస్సెస్సీ పరీక్షలు రాసి, వెంటనే తెలంగాణకు వచ్చి ఏఈఈ పరీక్ష రాయడం అభ్యర్థులకు ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. పరీక్షల తేదీల మార్పుపై స్వయంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లేఖ రాసినా పబ్లిక్ సర్వీస్ కమిషన్ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఒడిశా, బీహార్ రాష్ట్రాల్లో పరీక్ష తేదీలు మార్చినప్పుడు తెలంగాణలో ఎందుకు సాధ్యం కాదని నిలదీశారు. ప్రభుత్వం భేషజాలకు పోకుండా వెంటనే జోక్యం చేసుకుని నవంబర్ 6న జరగనున్న ఏఈఈ పరీక్షను వాయిదా వేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఓటు హక్కు కోసం కదం తొక్కిన జనం!

- ట్యాంక్‌బండ్‌పై రెండు వేల మందితో భారీ మానవహారం
- రాష్ట్రంలో 73 లక్షల ఓట్ల తొలగింపుపై తీవ్ర ఆందోళన
- సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించి, ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలి
- 'ఓట్ బచావో.. దేశ్ బచావో' అంటూ సామూహిక ప్రతిజ్ఞ




**హైదరాబాద్ (సమయం న్యూస్):** లక్షలాది మంది పౌరుల ప్రజాస్వామిక ఓటు హక్కులను కాలరాస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై భారీ మానవహారం నిర్వహించారు. పీపుల్ ఎగైనెస్ట్ ఎస్ఐఆర్, పౌర సమాజ, మానవ హక్కుల, రైతు, దళిత, యువజన, విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో రెండు వేల మందికి పైగా పౌరులు పాల్గొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌ను విధుల నుంచి తొలగించాలని, సీఈసీ చట్టం 2023ను ఉపసంహరించుకోవాలని వారు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. తొలగించిన ఓటర్లందరినీ తిరిగి జాబితాలో చేర్చాలని పట్టుబట్టారు.

## సగం ఓట్లు గల్లంతేనా?

దేశవ్యాప్తంగా 13.4 కోట్ల మందిని, తెలంగాణలో ఇప్పటికే 73 లక్షల మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగించారని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మరో 93 లక్షల మందికి అనుమానాస్పద ఓటర్లుగా నోటీసులు అందుతున్నాయని, ఈ పరిస్థితుల్లో దాదాపు 50 శాతం మంది ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇది ఓటర్ల ధ్రువీకరణ కాదని, సామూహిక ఓట్ల తొలగింపు ప్రక్రియ అని విమర్శించారు. ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకోవాల్సింది పోయి, ప్రభుత్వమే తమకు అనుకూలమైన ఓటర్లను ఎంచుకునే విపరీత పోకడ నడుస్తోందని మండిపడ్డారు.

## మైనారిటీలు, పేదలపైనే తీవ్ర ప్రభావం..

ఈ ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ముఖ్యంగా మహిళలు, శ్రామిక పేదలు, ముస్లింలతో సహా ఇతర మైనారిటీలు, ట్రాన్స్‌జెండర్లు తీవ్రంగా నష్టపోతున్నారని, క్షేత్రస్థాయిలో బీఎల్ఓలపైనా విపరీతమైన పనిభారం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై జరిగిన పోలీసుల అణచివేతను తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకుంటామని ఈ సందర్భంగా 'ఓట్ బచావో.. దేశ్ బచావో' అంటూ సామూహిక ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఓట్ల తొలగింపు తీవ్రతను వివరిస్తూ బాటసారులకు కరపత్రాలు పంపిణీ చేశారు.

## సంపాదకీయం



# హారన్ మోత మోగితే..
# జరిమానా వాత తప్పదు!

### రోడ్లపై ఇష్టారాజ్యంగా హారన్లు మోగిస్తే చర్యలు

### మలుపులు, లేన్ మార్పుల్లో ఇండికేటర్ తప్పనిసరి

**రోడ్డెక్కితే హారన్ మోత.. సిగ్నల్ పడితే అసహనం.. ముందు వాహనం కాస్త ఆలస్యంగా కదిలితే చాలు వెనుక నుంచి చెవులు చిల్లులు పడేలా శబ్దాలు! నగరాలు, పట్టణాల్లోనే కాదు.. గ్రామీణ రహదారులపైనా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అవసరం ఉన్నా లేకపోయినా హారన్ మోగించడం కొందరికి అలవాటుగా మారిపోయింది. మరికొందరైతే మలుపులు తిరిగేటప్పుడు ఇండికేటర్ వేయడం కూడా అనవసరమన్నట్లు వ్యవహరిస్తున్నారు. రహదారిపై తమకు మాత్రమే హక్కు ఉన్నట్లు ప్రవర్తిస్తూ ఇతరుల భద్రతను ప్రమాదంలో పడేస్తున్నారు. ఇలాంటి నిర్లక్ష్యపు అలవాట్లు కేవలం ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలే కాదు.. సమాజంలో పెరుగుతున్న అసహనానికి, క్రమశిక్షణ లోపానికి నిదర్శనాలు.**

వాహనాలకు హారన్ ఏర్పాటు చేసిన ప్రధాన ఉద్దేశం ప్రమాదాలను నివారించడం. ఎదురుగా వచ్చే వాహనదారులను, రహదారి దాటుతున్న పాదచారులను అప్రమత్తం చేయడానికే దాన్ని వినియోగించాలి. కానీ నేడు పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా మారుతోంది. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఎరుపు దీపం వెలుగుతున్నా వెనుక నుంచి హారన్లు మోగిస్తూనే ఉంటారు. ముందు వాహనం కదలడానికి అవకాశం లేకపోయినా శబ్దాలతో ఒత్తిడి పెంచుతారు. హారన్ మోగిస్తే ట్రాఫిక్ తొలగిపోతుందన్న అపోహలో కొందరు వ్యవహరిస్తున్నారు. ఈ ధోరణి వల్ల రహదారులపై అనవసర శబ్ద కాలుష్యం పెరుగుతోంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో బాధపడుతున్నవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఆసుపత్రులు, పాఠశాలలు, నివాస ప్రాంతాల సమీపంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. ఒకరి తొందరపాటు మరొకరి ప్రశాంతతను దెబ్బతీయకూడదన్న కనీస సామాజిక స్పృహ ప్రతి వాహనదారుడిలో ఉండాలి.

### శబ్ద కాలుష్యం.. కనిపించని ప్రమాదం!

వాయు కాలుష్యం గురించి విస్తృతంగా చర్చిస్తున్న సమాజం శబ్ద కాలుష్యాన్ని మాత్రం పెద్దగా పట్టించుకోవడం లేదు. వాహనాల హారన్లు, అధిక శబ్దం చేసే సైలెన్సర్లు, అదనంగా బిగించిన శబ్ద పరికరాలు ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. నిరంతరం అధిక శబ్దాలకు గురికావడం వల్ల మానసిక ఒత్తిడి, ఏకాగ్రత లోపం, నిద్రకు అంతరాయం వంటి సమస్యలు తలెత్తవచ్చు. అందుకే ప్రకటిత నిశ్శబ్ద ప్రాంతాల్లో హారన్ల వినియోగంపై ప్రత్యేక నియంత్రణలు ఉన్నాయి. అయినప్పటికీ కొందరు వాహనదారులు వాటిని పట్టించుకోవడం లేదు. రాత్రివేళ నివాస ప్రాంతాల్లో పెద్ద శబ్దాలతో హారన్లు మోగించడం ఇతరుల విశ్రాంతికి భంగం కలిగించడమే. శబ్దం చేయగలిగే అవకాశం ఉందని ప్రతిసారీ హారన్ మోగించడం సమంజసం కాదు. రోడ్డు ప్రమాదాలకు అతివేగం, మద్యం మత్తులో వాహనాలు నడపడం మాత్రమే కారణాలు కావు. చిన్నచిన్న నిర్లక్ష్యాలు కూడా తీవ్రమైన ప్రమాదాలకు దారితీస్తాయి. వాటిలో మలుపులు తిరిగేటప్పుడు, లేన్ మారేటప్పుడు ఇండికేటర్ వేయకపోవడం ఒకటి. వాహనం ఏ దిశగా వెళ్తుందో వెనుక వచ్చే వాహనదారులకు ముందుగానే తెలియాలి. అప్పుడే వారు తమ వేగాన్ని, దూరాన్ని సర్దుబాటు చేసుకోగలుగుతారు. కానీ కొందరు అకస్మాత్తుగా మలుపులు తిరుగుతూ ఇతరులను ప్రమాదంలోకి నెడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు, భారీ వాహనాల డ్రైవర్లు ఎవరైనా సరే ఇండికేటర్ వినియోగాన్ని తప్పనిసరి అలవాటుగా మార్చుకోవాలి. మలుపు పూర్తయిన తర్వాత దాన్ని ఆపేయడం కూడా అంతే ముఖ్యం. పొరపాటున ఇండికేటర్ వెలుగుతూనే ఉంటే వెనుక వచ్చే వాహనదారులకు తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉంది.

### నిబంధనలు ఉన్నా.. అమలులో నిర్లక్ష్యం ఎందుకు?

మోటారు వాహనాల చట్టంలో అనవసర హారన్ల వినియోగం, నిబంధనలకు విరుద్ధంగా శబ్ద పరికరాల్లో మార్పులు చేయడం వంటి ఉల్లంఘనలపై చర్యలకు అవకాశం ఉంది. సెక్షన్ 194ఎఫ్ ప్రకారం సంబంధిత ఉల్లంఘనలకు జరిమానాలు విధించవచ్చు. అలాగే వాహనాన్ని మళ్లించే ముందు అవసరమైన సంకేతాలు ఇవ్వకపోవడం వంటి చర్యలకు సెక్షన్ 177తోపాటు వర్తించే ఇతర నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అయితే చట్టాలు ఉన్నంత మాత్రాన సమస్య పరిష్కారం కాదు. వాటిని సమర్థంగా అమలు చేయడంతోపాటు వాహనదారుల్లో అవగాహన పెంచడం అత్యవసరం. ట్రాఫిక్ పోలీసులు కేవలం చలాన్లు విధించడానికే పరిమితం కాకుండా నిబంధనల ప్రాధాన్యాన్ని వివరించే కార్యక్రమాలు నిర్వహించాలి. వాహనాల తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధమైన అధిక శబ్ద హారన్లను గుర్తించి చర్యలు తీసుకోవాలి. రహదారి ఏ ఒక్కరి సొత్తు కాదు. వాహనదారులు, పాదచారులు, సైకిల్‌పై వెళ్లేవారు, ప్రజా రవాణాను వినియోగించేవారు.. అందరికీ దానిపై సమాన హక్కు ఉంది. ఒకరి నిర్లక్ష్యం మరొకరి ప్రాణాలకు ముప్పుగా మారకూడదు. ముఖ్యంగా వాహనం నడిపేటప్పుడు సహనం అత్యంత అవసరం. ముందు వాహనం నెమ్మదిగా వెళ్తున్నా పరిస్థితిని అర్థం చేసుకోవాలి. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద కొన్ని క్షణాలు వేచి ఉండాల్సి వచ్చినా అసహనం ప్రదర్శించకూడదు. అనవసర హారన్లతో ఇతరులను ఇబ్బంది పెట్టకుండా, సరైన సమయంలో ఇండికేటర్లు ఉపయోగిస్తూ, నిర్ణీత వేగ పరిమితులను పాటిస్తూ ప్రయాణించాలి. వాహనం మరమ్మతులకు గురైనప్పుడు పరిస్థితికి అనుగుణంగా ప్రమాద హెచ్చరిక దీపాలను ఉపయోగించి, సాధ్యమైనంత త్వరగా సురక్షిత ప్రదేశానికి తరలించాలి. హారన్ మోగించడం వల్ల ముందున్న వాహనం వేగంగా కదలకపోవచ్చు. కానీ ఆ శబ్దం కారణంగా ఇతరులు అసహనానికి, ఆందోళనకు గురయ్యే అవకాశం ఉంది. ఇండికేటర్ వేయకుండా మలుపు తిరిగితే కొన్ని క్షణాల సమయం ఆదా కావచ్చేమో కానీ ప్రమాదం జరిగితే దాని మూల్యం ఎంతో భారీగా ఉంటుంది. అందుకే ట్రాఫిక్ నిబంధనలను జరిమానాల నుంచి తప్పించుకునే మార్గంగా కాకుండా ప్రాణాలను కాపాడే రక్షణ కవచంగా భావించాలి. రహదారిపై మనం చూపించే సహనం, క్రమశిక్షణ, బాధ్యతాయుత ప్రవర్తనే నాగరిక సమాజానికి అసలైన గుర్తింపు. హారన్ మోత తగ్గాలి.. రహదారులపై బాధ్యత పెరగాలి. జరిమానా పడకముందే మన ప్రవర్తన మారాలి. అప్పుడే రోడ్డు ప్రయాణం అందరికీ సురక్షితంగా, ప్రశాంతంగా మారుతుంది.

# ఎన్నికల కోసం విద్యార్థుల పోరు

### జామియాలో ఉద్రిక్తత!

- విద్యార్థి సంఘం పునరుద్ధరణ కోసం ఆమరణ నిరాహార దీక్షలు
- నిరసన టెంట్ల తొలగింపు ప్రయత్నంతో భద్రతా సిబ్బందితో ఘర్షణ
- 2006 నుంచి నిలిచిపోయిన విద్యార్థి సంఘం ఎన్నికలు
- క్యాంపస్‌లోకి ప్రవేశించిన కాంగ్రెస్ ఎంపీలపై రిజిస్ట్రార్ ఆరోపణలు
- గోడలపై వివాదాస్పద నినాదాలు.. విచారణకు బీజేపీ డిమాండ్
- ఉద్రిక్త పరిస్థితులతో తరగతుల నిర్వహణ ఆన్‌లైన్‌కు మార్పు




**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** దేశ రాజధాని ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంఘం ఎన్నికల కోసం చేపట్టిన ఆందోళనలు ఉద్రిక్తతకు దారితీశాయి. విద్యార్థి సంఘాన్ని పునరుద్ధరించి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆమరణ నిరాహార దీక్షలకు దిగారు. శనివారం నిరసన టెంట్లను తొలగించేందుకు భద్రతా సిబ్బంది ప్రయత్నించడంతో విద్యార్థులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తోపులాట, ఘర్షణ చోటుచేసుకోవడంతో క్యాంపస్‌లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయంలో 2006లో జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో విద్యార్థి సంఘాన్ని రద్దు చేశారు. అప్పటి నుంచి విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించడం లేదు. విద్యార్థులకు ప్రజాస్వామ్యబద్ధమైన ప్రాతినిధ్యం కల్పించాలని, సంఘాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 12 నుంచి విద్యార్థులు నిరసనలు కొనసాగిస్తున్నారు. తమ డిమాండ్లను నెరవేర్చే వరకు ఆందోళన విరమించేది లేదని నిరసనకారులు స్పష్టం చేస్తున్నారు. శుక్రవారం కాంగ్రెస్ ఎంపీలు ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ, ఇమ్రాన్ మసూద్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలోకి గోడ దూకి ప్రవేశించారన్న ఘటన వివాదాస్పదమైంది. ఈ విషయంపై జామియా రిజిస్ట్రార్ మహతాబ్ ఆలం రిజ్వీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇద్దరు కాంగ్రెస్ నాయకులు క్యాంపస్‌లోకి ప్రవేశించి విద్యార్థులను రెచ్చగొట్టారని, రాజకీయ ప్రయోజనాల కోసం వారిని ఉపయోగించుకునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. మరోవైపు విశ్వవిద్యాలయ గోడలపై జమ్మూకశ్మీర్‌కు సంబంధించిన వివాదాస్పద నినాదాలు కనిపించడం రాజకీయ చర్చకు దారితీసింది. వాటిని దేశ వ్యతిరేక నినాదాలుగా పేర్కొన్న బీజేపీ, ఘటనపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేసింది. నినాదాలు ఎవరు రాశారనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. విద్యార్థుల నిరసనలు, భద్రతా సిబ్బందితో ఘర్షణ నేపథ్యంలో క్యాంపస్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ పరిణామాల దృష్ట్యా తరగతుల నిర్వహణను ఆన్‌లైన్ విధానానికి మార్చినట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ వెల్లడించారు. విద్యార్థి సంఘం ఎన్నికల నిర్వహణపై యాజమాన్యం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

# ఆపరేషన్ సిందూర్..
# ట్రంప్ నోట మళ్లీ అదే పాట!

### భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానంటూ మరోసారి ప్రకటన
### ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది యుద్ధాలను నిలువరించానని వ్యాఖ్యలు
### ఐక్యరాజ్యసమితి సహకారం లేకుండానే శాంతి నెలకొల్పానని వెల్లడి
### నోబెల్ శాంతి బహుమతి రాకపోవడంపై అసంతృప్తి
### అమెరికా మధ్యవర్తిత్వం లేదని ఇప్పటికే స్పష్టం చేసిన భారత్



**వాషింగ్టన్, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** భారత్, పాకిస్థాన్ మధ్య సైనిక ఘర్షణను తానే నిలువరించానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. అమెరికా మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో ఫ్లోరిడాలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో మాట్లాడిన ఆయన 'ఆపరేషన్ సిందూర్' అంశాన్ని ప్రస్తావించారు. అణ్వాయుధాలు కలిగిన భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తన దౌత్య ప్రయత్నాలతో ఆపినట్లు మరోసారి చెప్పుకొచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది యుద్ధాలను నిలువరించానని, ఇందుకోసం ఐక్యరాజ్యసమితికి ఒక్క ఫోన్ కూడా చేయాల్సిన అవసరం రాలేదని పేర్కొన్నారు. ఇన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ తనకు నోబెల్ శాంతి బహుమతి దక్కలేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు.

### మధ్యవర్తిత్వ వాదనను ఖండించిన భారత్

2025 ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి ప్రతీకారంగా అదే ఏడాది మే నెలలో పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరుతో దాడులు నిర్వహించింది. అనంతరం ఇరు దేశాల మధ్య సైనిక ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అయితే ఈ ఘర్షణను నిలువరించడంలో అమెరికా మధ్యవర్తిత్వం లేదని భారత ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది. పాకిస్థాన్ అభ్యర్థన మేరకు ఇరు దేశాల సైనిక ఉన్నతాధికారుల మధ్య జరిగిన ప్రత్యక్ష చర్చల అనంతరమే సైనిక చర్యలను నిలిపివేసినట్లు వెల్లడించింది. అయినప్పటికీ ట్రంప్ మాత్రం భారత్, పాకిస్థాన్ మధ్య ఘర్షణను తానే ఆపానన్న వాదనను పునరావృతం చేస్తున్నారు. ఆయన తాజా వ్యాఖ్యలతో అమెరికా మధ్యవర్తిత్వంపై మరోసారి చర్చ మొదలైంది.



# ర్యాలీ వాయిదా వేయండి

### రూ.10 వేల కోట్ల నష్టం తప్పించండి!

### రాహుల్ గాంధీకి ఢిల్లీ వ్యాపార సంఘాల విజ్ఞప్తి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 24 (సమయం న్యూస్):** నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో కాంగ్రెస్ సహా ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టనున్న సంగతి తెలిసిందే. అయితే, దీపావళిని దృష్టిలో ఉంచుకుని ఈ ర్యాలీని వాయిదా వేసుకోవాలని ద ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) కోరింది. లేకపోతే రూ.10,000 కోట్ల వరకు నష్టం వాటిల్లుతుందని వివరించింది. ఈ మేరకు సీటీఐ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్ రాహుల్ గాంధీని కోరారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ ఇండియా బ్లాక్ ఆధ్వర్యంలో రాంలీలా మైదానంలో ర్యాలీ జరగనుంది. ఈ ర్యాలీ సందర్భంగా ఆ రోజు వ్యాపార సంస్థలు అన్నీ మూసేయాల్సి ఉంటుంది. అలాగే, ముందు నుంచే అక్కడ పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలి. దీంతో ర్యాలీకి కొద్ది రోజుల ముందునుంచే వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు ఆటంకం కలుగుతుంది. ఈ నేపథ్యంలో సీటీఐ తరఫున ఆ సంస్థ ఛైర్మన్ బ్రిజేష్ గోయల్.. రాహుల్ గాంధీకి లేఖ రాశారు. ఆయన లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం.. దీపావళి, ధంతేరాస్ సందర్భంగా ఈ ప్రాంతంలో రూ.25,000 కోట్ల వ్యాపారం జరుగుతుంది. బంగారం, వెండితోపాటు ఎలక్ట్రానిక్స్, దుస్తులు, వంట సామగ్రి, డ్రైఫ్రూట్స్, స్వీట్స్, వాహనాలు, ఆస్తుల కొనుగోలు, గిఫ్ట్ ఐటమ్స్ వంటివి భారీ స్థాయిలో అమ్ముడుపోతాయి. అయితే, ఇండియా బ్లాక్ ర్యాలీ వల్ల ఈ వ్యాపారాలకు ఆటంకం కలుగుతుంది. దీనివల్ల రూ.10,000 కోట్ల నష్టం వాటిల్లే అవకాశం ఉంది. నవంబర్ 6న ధంతేరాస్, 8న దీపావళి, 10న భాయ్ దూజ్ వంటి పండుగలున్నాయి. అందువల్ల నవంబర్ 10 వరకు ఈ ర్యాలీని వాయిదా వేసుకోవాల్సిందిగా సూచించారు. పండుగలకు వారం రోజుల ముందు నుంచి వ్యాపారం ఉధృతంగా సాగుతుందన్నారు. ఇప్పటికే అక్టోబర్‌లో సాగిన అనేక ర్యాలీల వల్ల తీవ్రంగా నష్టపోయామన్నారు. రోడ్లు బ్లాక్ చేయడం, రవాణా సదుపాయం లేకపోవడం, ప్రభుత్వ ఆంక్షల వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. అందువల్ల తమ విన్నపాన్ని దృష్టిలో ఉంచుకుని నవంబర్ 10 వరకు ర్యాలీని వాయిదా వేసుకోవాలని, ఆ తర్వాతే ర్యాలీ నిర్వహించుకోవాలని సూచించారు.

# ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

### పార్కింగ్ బే వద్దకు ఫ్లైట్




**న్యూఢిల్లీ:** ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు వచ్చింది. టేకాఫ్‌కు ముందు ఫ్లైట్ టాయిలెట్‌లో ఈ బెదిరింపు సందేశాన్ని సిబ్బంది గుర్తించారు. ఈ నేపథ్యంలో ఆ విమానం పార్కింగ్ బే వద్దకు తిరిగి చేరుకున్నది. ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఐజీఐ)లో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం 3.15 గంటలకు ఇండిగో విమానం 6ఈ 6091, ఢిల్లీ నుంచి చెన్నైకు బయలుదేరాల్సి ఉన్నది. అయితే టేకాఫ్‌కు సిద్ధమవుతున్న సమయంలో ఆ విమానం వెనుక భాగంలోని టాయిలెట్‌లో ఒక 'హెచ్చరిక' నోట్ లభించింది. ఆ విమానాన్ని చెన్నైకి ప్రయాణం కొనసాగించవద్దని హెచ్చరించినట్లుగా అందులో ఉన్నది. కాగా, ఈ బెదిరింపు సందేశాన్ని విమాన సిబ్బంది గుర్తించారు. దీంతో సంబంధిత నిబంధనల ప్రకారం విమానం టేకాఫ్‌ను రద్దు చేశారు. దానిని తిరిగి బేకి తీసుకువచ్చారు. అవసరమైన ప్రామాణిక కార్యాచరణ విధానాన్ని (ఎస్‌వోపీ) పూర్తి చేశారు. ఆ బెదిరింపు నోట్ బూటకమని తేలింది. ఈ నేపథ్యంలో సుమారు 2గంటలు ఆలస్యంగా శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో విమానం టేకాఫ్ అయ్యింది. రాత్రి 7.40 గంటలకు చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో అది సురక్షితంగా ల్యాండ్ అయ్యిందని ఇండిగో అధికారి తెలిపారు.

# పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన పెద్ది స్వప్న

- పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి

**నర్సంపేట, అక్టోబరు 24 (సమయం న్యూస్) :**



వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియపై బీఆర్ఎస్ నాయకులు దృష్టి సారించారు. ఈ క్రమంలో నర్సంపేట నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జిగా నియమితులైన శాసనమండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డిని వరంగల్ జిల్లా మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న సుదర్శన్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నర్సంపేట నియోజకవర్గంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై ఇరువురూ చర్చించారు. అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించడం, నమోదు ప్రక్రియను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటరు నమోదు కీలకమైన నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ నమోదు ప్రక్రియపై అవగాహన పెంచుకోవాలని, నిర్దేశిత నిబంధనల ప్రకారం ఓటరుగా నమోదు చేసుకోవాలని శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

# మూలనపడ్డ డీఫ్లోరైడ్ ప్రాజెక్టుకు మోక్షమెప్పుడు.?

- డీఫ్లోరైడ్ ప్రాజెక్టును వినియోగంలోకి తేవాలి
- దేవాదుల జలాలతో నర్సంపేట తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలి... టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్

**నర్సంపేట, అక్టోబర్ 24 (సమయం న్యూస్) :**

ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవక చెరువులు, కుంటలు ఎండిపోతున్నాయని, నర్సంపేట నియోజకవర్గంలో తాగునీరు, సాగునీటి సమస్యలు తీవ్రమవుతున్నాయని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో నీటి ఎద్దడి మరింత తీవ్రమయ్యే అవకాశం ఉన్నందున ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. అశోక్‌నగర్ సమీపంలో నిర్మించిన డీఫ్లోరైడ్ ప్రాజెక్టును తక్షణమే వినియోగంలోకి తీసుకొచ్చి, దేవాదుల ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను తరలించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా గ్రామాలకు సరఫరా అవుతున్న నీరు ప్రజల అవసరాలకు సరిపోవడం లేదని, కొన్ని సందర్భాల్లో రోజుల తరబడి నీటి సరఫరా నిలిచిపోతోందని తెలిపారు. మరోవైపు చెరువులు, కుంటలు ఎండిపోవడంతో పంట పొలాలు వాడిపోతున్నాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులపై నిపుణులు చేస్తున్న హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని అధికారులు ఇప్పటి నుంచే ప్రత్యామ్నాయ నీటి వనరులపై దృష్టి సారించాలని సూచించారు.

ప్రజల భవిష్యత్తు అవసరాల కోసమే ప్రాజెక్టు... 1999లో అప్పటి నర్సంపేట ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అశోక్‌నగర్ సమీపంలో సుమారు రూ.38 కోట్లతో డీఫ్లోరైడ్ ప్రాజెక్టు నిర్మాణానికి



ప్రతిపాదనలు చేపట్టిన సమయంలో వివిధ వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమైందని అంబటి శ్రీనివాస్ గుర్తుచేశారు. అప్పట్లో పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా, న్యాయవాదిగా ఉన్న తాను నాయకత్వం వహించిన కమిటీ ప్రజలు, వివిధ పార్టీల నాయకులతో చర్చించి, నర్సంపేట ప్రజల భవిష్యత్తు తాగునీటి అవసరాలను వివరించడంతో నిర్మాణానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయని తెలిపారు. అనంతరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తై వినియోగంలోకి వచ్చిందని పేర్కొన్నారు. 2014 తర్వాత మిషన్ భగీరథ పథకం అమల్లోకి రావడంతో డీఫ్లోరైడ్ ప్రాజెక్టు నిరుపయోగంగా మారిందని తెలిపారు. ప్రస్తుతం నెలకొన్న నీటి ఎద్దడి పరిస్థితుల్లో ఈ ప్రాజెక్టును తిరిగి వినియోగంలోకి తీసుకురావడం అత్యవసరమని అన్నారు. దేవాదుల నుంచి గోదావరి జలాలను తరలించి ప్రాజెక్టును అందుబాటులోకి తెస్తే నర్సంపేట నియోజకవర్గ ప్రజలకు తాగునీటి సమస్య నుంచి ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రజలకు భవిష్యత్తులో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే కార్యాచరణ చేపట్టాలని కోరారు. ఈ పర్యటనలో టీజేఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గుంటి రామచంద్ర, టీజేఎస్ నాయకులు షేక్ సంధాని, రాజు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# చట్టసభల్లో పట్టభద్రుల గొంతు వినిపించాలి

- ఓటు హక్కుతోనే పట్టభద్రుల గళానికి గుర్తింపు
- విద్యాసంస్థల్లో అవగాహన... పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు కావాలి
- జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి శివకోటి యాదవ్

**నర్సంపేట, అక్టోబరు 24 (సమయం న్యూస్) :**



పట్టభద్రులంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ముందుగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని జనసేన పార్టీ నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు శివకోటి యాదవ్ పిలుపునిచ్చారు. చట్టసభల్లో పట్టభద్రుల సమస్యలు, ఆకాంక్షలకు ప్రాతినిధ్యం లభించాలంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కీలకమని పేర్కొన్నారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శనివారం శివకోటి యాదవ్ ఆధ్వర్యంలో జనసేన నాయకులు నర్సంపేట పట్టణంలోని డఫోడిల్స్ హైస్కూల్, ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలను సందర్శించారు. ఆయా విద్యాసంస్థల్లోని ఉపాధ్యాయులు, అధ్యాపక పట్టభద్రులకు ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. జనసేన ఎమ్మెల్సీ అభ్యర్థి గడల శ్రీనివాసరావు అభ్యర్థిత్వాన్ని వివరించారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఇతర పట్టభద్రులు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని శివకోటి యాదవ్ కోరారు. ఓటరు నమోదుపై నిర్లక్ష్యం చేయకుండా, అవసరమైన పత్రాలతో ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. పట్టభద్రులు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములై తమ అభిప్రాయాలను ఓటు ద్వారా వ్యక్తం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గంగుల రంజిత్,, రోడ్డ శ్రీకాంత్, డాఫోడిల్స్ విద్యాసంస్థల చైర్మన్, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు పొరిక కృష్ణమోహన్, పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- సమ్మెకు బీఆర్‌టీయూ సంపూర్ణ మద్దతు
- బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు

**నర్సంపేట, అక్టోబర్ 24 (సమయం న్యూస్)**

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ వారు చేపట్టిన నిరవధిక సమ్మెకు బీఆర్‌టీయూ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కలువాల లలిత, జిల్లా కార్యదర్శి గోలి సంధ్య సమ్మె శిబిరంలో పాల్గొని ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గోనె యువరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 17 విభాగాల్లో పనిచేస్తున్న సుమారు 17 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం 12 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి, అప్పటికే పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంపై ఆవేదన




వ్యక్తం చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రజారోగ్య వ్యవస్థలో కీలకంగా పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు వారి పోరాటానికి బీఆర్‌టీయూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ జిల్లా నాయకులు మాధవితో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- ఆశాల పోరుకు బీఆర్ఎస్ బాసట.. బీఆర్‌టీయూలోకి భారీగా చేరికలు
- రూ.18 వేల వేతనం సాధించే వరకు ఆశాలతోనే..మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్

**వరంగల్, అక్టోబర్ 24 (సమయం న్యూస్) :**



ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఐక్య పోరాటాలే మార్గమని, వారి ఆందోళనకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఉంటుందని వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ అన్నారు. వరంగల్ నగరంలోని దేశాయిపేట, చింతల్ ప్రాంతాలకు చెందిన పలువురు ఆశా కార్యకర్తలు బీఆర్‌టీయూ అనుబంధ సంఘంలో చేరారు. బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, ఆశాల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కలువాల లలిత, జిల్లా ప్రధాన కార్యదర్శి గోలి సంధ్య, జిల్లా నాయకులు పిట్టల శ్రీలత, సుజాత ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా నన్నపనేని నరేందర్ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన నెలకు రూ.18 వేల వేతనం హామీని అమలు చేయాలని ఆశా కార్యకర్తలు చేస్తున్న పోరాటానికి బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని తెలిపారు. ప్రజారోగ్య రంగంలో ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తూ ఆరోగ్య వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు సేవలందిస్తున్న ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించడంతోపాటు, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం ఆశా కార్యకర్తలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు సృజన, మాధవి, శోభ, సుమలత, ప్రమిద, మాలతి తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల ఆర్థిక సహాయం

- 50 కిలోల బియ్యం అందజేత.. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా

**ఆలేరు, అక్టోబర్ 24(సమయం న్యూస్)**

ఆలేరు మండలం కొల్లూరు గ్రామానికి చెందిన ఇటీవల మృతి చెందిన చీకట్ల అంజయ్య కుటుంబాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు పార్నంది భాస్కర్ రూ.3,000 ఆర్థిక సహాయం అందించారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని నాయకులు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు సర్పంచి జనగాం సుధరణి శ్రీపాల్‌రెడ్డి, ఉపసర్పంచి గాజుల దశరథ, గ్రామశాఖ అధ్యక్షుడు గాజుల ఆంజనేయులు యాదవ్, ఆలేరు



వైస్ ఎంపీపీ యాదవ్, గ్రామశాఖ ఉపాధ్యక్షుడు దార బాలస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ శివరాత్రి లక్ష్మయ్య, వార్డు సభ్యుడు కాంగ్రెస్ నాయకులు ఉపాధ్యక్షుడు కాన్రాజ్ కరుణాకర్ పాల్గొన్నారు.

## అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు

- దీపావళి వేళ నిబంధనలు పాటించాలి... మట్వాడా ఇన్‌స్పెక్టర్ కరుణాకర్

**వరంగల్, అక్టోబర్ 24 (సమయం న్యూస్)**



దీపావళి పండుగ నేపథ్యంలో మట్వాడా పోలీస్‌స్టేషన్ పరిధిలో ముందస్తు అనుమతులు లేకుండా బాణసంచా నిల్వ విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మట్వాడా ఇన్‌స్పెక్టర్ ఎన్. కరుణాకర్ హెచ్చరించారు. బాణసంచా విక్రయించాలనుకునే వ్యాపారులు సంబంధిత అధికారుల అనుమతులు తప్పనిసరిగా పొందాలని సూచించారు. నివాస ప్రాంతాల్లో, అనుమతి లేని ప్రదేశాల్లో బాణసంచా నిల్వ చేయడం నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారి నుంచి బాణసంచా స్వాధీనం చేసుకోవడంతోపాటు, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజల భద్రత దృష్ట్యా వ్యాపారులు, ప్రజలు పోలీసులకు సహకరించి, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ సురక్షిత వాతావరణంలో దీపావళి పండుగను జరుపుకోవాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

## కార్మిక హక్కుల పరిరక్షణకు సీఐటీయూ మహాధర్నా

- అక్టోబర్ 25, 26 తేదీల్లో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఆందోళన

**కీసర, అక్టోబర్ 24 (సమయం):**

కార్మిక చట్టాలు, హక్కుల పరిరక్షణ కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో అక్టోబర్ 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్న మల్టీపుల్ మహాధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ కీసర మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు కీసర ఔటర్ రింగ్ రోడ్డు వద్ద హెచ్‌ఎండీఏ కాంట్రాక్టు కార్మికుల సమక్షంలో మహాధర్నా వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులందరికీ నెలకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, ప్రతి నెల ఒకటో తేదీన కార్మికుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జీతాలు జమ చేయాలని కోరారు. అలాగే ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించడం తోపాటు వారాంతపు సెలవులు అమలు చేయాలని, తొమ్మిది రకాల భద్రతా పరికరాలు అందించాలని డిమాండ్ చేశారు. అర్బన్ ఫారెస్ట్రీ, పార్కులు, ఇంజినీరింగ్, పారిశుద్ధ్య విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. కాంట్రాక్టు గడువు ముగిసిందనే కారణంతో కార్మికులను తొలగించడం లేదా మార్చడం చేయకూడదని, ప్రస్తుతం పనిచేస్తున్న వారందరినీ యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో షామీర్‌పేట, కీసర, ఘట్‌కేసర్ పరిసర ప్రాంతాలకు చెందిన హెచ్‌ఎండీఏ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



## బియ్యం సరఫరాను వేగవంతం చేయాలి

**కామారెడ్డి, అక్టోబర్ 24( సమయం న్యూస్)**

ప్రభుత్వానికి అందించాల్సిన బియ్యం నిల్వలను రైస్ మిల్లర్లు త్వరితగతిన సరఫరా చేయాలని పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ జి.వి. శ్యాం ప్రసాద్ లాల్ ఆదేశించారు. కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో బియ్యం సరఫరాపై రైస్ మిల్లర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ఎలాంటి జాప్యం లేకుండా బియ్యం సరఫరా పూర్తి చేయాలని సూచించారు. అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులో లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్, డీఎం శ్రీకాంత్, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

- దోమల మందు పిచికారీ
- 23వ డివిజన్‌లో ముమ్మరంగా ఫాగింగ్... మంత్రి కమలాకర్ నేత

**కొత్తవాడ/వరంగల్, అక్టోబర్ 24 (సమయం న్యూస్)**

ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా 23వ డివిజన్‌లో శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో దోమల నివారణ చర్యలు చేపట్టారు. శానిటేషన్ అధికారి మధుకర్ తన సిబ్బందితో కలిసి డివిజన్‌లోని వివిధ కాలనీలు, వీధుల్లో గ్యాంగ్ వార్ యంత్రాల ద్వారా దోమల మందు పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ కంటెస్టింగ్ కార్పొరేటర్ మంత్రి కమలాకర్ నేత పాల్గొని సిబ్బందితో కలిసి పలు ప్రాంతాల్లో దోమల మందు పిచికారీ చేయించారు. దోమల వ్యాప్తిని అరికట్టి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు పారిశుద్ధ్య చర్యలు నిరంతరం కొనసాగించాలని సూచించారు. వర్షాకాలం అనంతరం దోమల పెరుగుదలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందున, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల వద్ద నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి, దోమల నివారణకు సహకరించాలని కోరారు. డివిజన్‌లో పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని మంత్రి కమలాకర్ నేత తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ అధికారి మధుకర్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.



## రైల్వే భద్రతకు ఇంటెలిజెన్స్ ఆధారిత పోలీసింగ్

**న్యూఢిల్లీ, అక్టోబర్ 24( సమయం న్యూస్)**

రైల్వే భద్రతను మరింత పటిష్టం చేసేందుకు RPF, GRP, రాష్ట్ర పోలీసుల మధ్య సమన్వయం పెంచాలని 8వ అఖిల భారత GRP చీఫ్‌ల సదస్సులో నిర్ణయించారు. ప్రయాణికుల ఫిర్యాదుల పరిష్కారం కోసం GRP సిబ్బందిని RailMadadతో అనుసంధానించారు. దీపావళి, ఛఠ్ పండుగల సందర్భంగా రద్దీ నియంత్రణ, ప్రయాణికుల సురక్షిత రాకపోకల కోసం ముందస్తు ప్రణాళికకు ప్రాధాన్యం ఇచ్చారు. రైళ్లపై రాళ్లదాడులను అరికట్టేందుకు, పెట్రోలింగ్, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. దక్షిణ మధ్య రైల్వే 'పింక్ పెట్రోల్', మధ్య రైల్వే 'ప్రాజెక్ట్ దిశ' వంటి భద్రతా కార్యక్రమాలను సదస్సులో ప్రదర్శించారు. రైల్వే భద్రతకు ఇంటెలిజెన్స్ ఆధారిత పోలీసింగ్, సాంకేతికత వినియోగం, సమన్వయం కీలకమని అధికారులు పేర్కొన్నారు.

## జగిత్యాల ప్రభుత్వ వైద్య కళాశాల పనులు గడువులోగా పూర్తి చేయాలి

**జగిత్యాల, అక్టోబర్ 24( సమయం న్యూస్)**



జగిత్యాలలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్తో కలిసి పరిశీలించారు. భవనం, హాస్టల్ బ్లాక్, కిచెన్, తరగతి గదుల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు.నిర్మాణ పనులను నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని, ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారువైద్య కళాశాల అందుబాటులోకి రావడం ద్వారా జిల్లాలో వైద్య విద్య అభివృద్ధి చెందడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, వైద్య కళాశాల విద్యార్థులకు మెరుగైన అవకాశాలు, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు దోహదపడుతుందని తెలిపారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి, హాస్టల్, కిచెన్, తరగతి గదులు తదితర మౌలిక వసతులను నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు.

## ఉత్తమ వైద్య సేవలతో ఉన్నత స్థానాలకు

**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 24( సమయం న్యూస్)**

ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నిర్వహించిన వైట్ కోట్ సెర్మనీలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితె పాల్గొని విద్యార్థులకు వైట్ కోట్లు అందజేశారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వైద్యులు ఉత్తమ సేవలు అందిస్తూ ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సామాజిక సేవలో భాగంగా కొందరికైనా ఉచిత వైద్యం అందించాలని సూచించారు. వైద్యులు సేవాభావంతో పనిచేసి సమాజానికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. మెడికల్ కళాశాల, బాలుర హాస్టల్ నిర్మాణ పనులను వేగవంతం చేస్తామని తెలిపారు.



## అటవీ సంరక్షణకు సమన్వయంతో పనిచేయాలి

- **కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్, అక్టోబర్ 24:( సమయం న్యూస్,)**

జిల్లాలో అటవీ విస్తీర్ణం పెంపు, అక్రమ కలప రవాణా, వన్యప్రాణుల వేటను అరికట్టడమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. అటవీ భూముల ఆక్రమణలపై నిఘా, సరిహద్దుల జియోట్యాగింగ్ చేపట్టాలని సూచించారు. పోడు భూములు, అక్రమ రవాణా నియంత్రణకు అటవీ, పోలీస్ శాఖలు సంయుక్తంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, అటవీ సంరక్షణలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని కోరారు.



## ప్రధాని మోదీ అక్టోబర్ 25న ఉత్తరప్రదేశ్, ఒడిశా పర్యటన

**న్యూఢిల్లీ, అక్టోబర్ 24( సమయం న్యూస్,)**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అక్టోబర్ 25న ఉత్తరప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో పర్యటించనున్నారు.వారణాసిలో: ఉదయం 11 గంటలకు కొత్త గార్మెంట్ తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1 గంటకు నమో ఘాట్ వద్ద జరిగే ఎయిర్ ఫోర్స్ డే ఏరియల్ డిస్‌ప్లే-2026ను వీక్షిస్తారు. భారత వాయుసేన 94వ వార్షికోత్సవం సందర్భంగా "Wings over Ganges" థీమ్‌తో కార్యక్రమం నిర్వహించనున్నారు.
తేజస్, ఎల్‌సీహెచ్ ప్రచండ్, సుఖోయ్30 ఎంకేఐ, రాఫెల్ తదితర యుద్ధ విమానాలతో పాటు సూర్యకిరణ్, సారంగ్ బృందాలు ప్రదర్శనలు ఇవ్వనున్నాయి.భువనేశ్వర్‌లో: సాయంత్రం 4:45 గంటలకు ఆర్‌బీఐ కొత్తగా ఏర్పాటు చేసిన డేటా సెంటర్, సైబర్ సెక్యూరిటీ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ను ప్రధాని ప్రారంభిస్తారు. ఈ కేంద్రంలో కీలక చెల్లింపులు, సెటిల్‌మెంట్ వ్యవస్థలకు సంబంధించిన మిషన్‌క్రిటికల్ సదుపాయాలు ఉంటాయి.కొత్త సైబర్ సెక్యూరిటీ సంస్థలో క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆధునిక సాంకేతికతలపై శిక్షణ, పరిశోధనకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

## ఎల్‌నినో పరిస్థితులపై జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ

**నిజామాబాద్, అక్టోబర్ 24( సమయం న్యూస్)**

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు, కరువు పరిస్థితులు తలెత్తే అవకాశాల నేపథ్యంలో వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు.అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చైర్మన్‌గా, జిల్లా వ్యవసాయ అధికారి మెంబర్ కన్వీనర్‌గా, వివిధ శాఖల అధికారులు సభ్యులుగా కమిటీలో ఉంటారు.కరువు పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించడం, శాఖల మధ్య సమన్వయం, నివారణ చర్యల అమలు, వర్షపాతం-భూగర్భ జలాలు-రిజర్వాయర్ల నీటి నిల్వలను వారానికొకసారి సమీక్షించడం కమిటీ ప్రధాన బాధ్యతలు. అలాగే ప్రభావిత గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు నిర్వహించి పంటల వైవిధ్యీకరణ, తాగునీరు, పశువుల దాణా, విద్యుత్ సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనుంది. పరిస్థితులపై రోజువారీ నివేదికలు సమర్పిస్తూ తక్షణ నివారణ చర్యలు చేపట్టనున్నారు.

## పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**నిజామాబాద్, అక్టోబర్ 24( సమయం న్యూస్,)**

అర్సపల్లిలోని ఏ.వీ. ఎంటర్‌ప్రైజెస్ సెంటర్‌లో నిర్వహించిన టీఎస్‌పీఎస్సీ అసిస్టెంట్ సైంటిస్ట్ CBT పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ హాజరు, భద్రతా ఏర్పాట్లు, అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. టీఎస్‌పీఎస్సీ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ పరీక్షలు సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.



# శిథిలాల్లోనూ చెక్కుచెదరని కాకతీయ వైభవం!





- **వరంగల్ కోట అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టి.. చరిత్రకు పునర్వైభవం ఎప్పుడో.?**
- **కాకతీయుల కళా సంపదకు పరిరక్షణ.. పర్యాటకాభివృద్ధితో కొత్త అవకాశాలు**

**వరంగల్, అక్టోబర్ 24 (సమయం న్యూస్) :**

రాతి కట్టడాలు మూగబోయినా వాటి వెనుక దాగిన చరిత్ర మాత్రం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. శతాబ్దాల క్రితం కాకతీయుల పరాక్రమానికి, అద్భుత శిల్పకళా నైపుణ్యానికి, రాజరిక వైభవానికి ప్రతీకగా నిలిచిన వరంగల్ కోట నేటికీ తెలంగాణ చారిత్రక ఔన్నత్యాన్ని చాటుతోంది. కాలగమనంలో ఎన్నో పరిణామాలకు సాక్షిగా నిలిచిన ఈ చారిత్రక సంపదను పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం పురావస్తు పరిరక్షణ పనులు చేపడుతుండగా, రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకాభివృద్ధి విధానంలో వరంగల్ వారసత్వ ప్రాంతానికి ప్రాధాన్యం కల్పిస్తోంది. అయితే కాకతీయుల ఘన చరిత్రను ప్రతిబింబించే ఈ కోటకు మరింత వైభవం తీసుకురావాలంటే పరిరక్షణ, మౌలిక సదుపాయాలు, పర్యాటక నిర్వహణపై సమగ్ర కార్యాచరణ అవసరం.

### కాకతీయుల రాజధాని.. చరిత్రకు చిరునామా

తెలంగాణ చరిత్రలో వరంగల్ కోటకు విశిష్ట స్థానం ఉంది. 12వ శతాబ్దం నుంచి 14వ శతాబ్దం వరకు దక్షిణ భారతదేశంలో ప్రాబల్యం సాధించిన కాకతీయులు వరంగల్‌ను తమ రాజధానిగా అభివృద్ధి చేశారు. గణపతిదేవుడు, రాణి రుద్రమదేవి, ప్రతాపరుద్రుల పాలనా కాలంలో ఈ ప్రాంతం రాజకీయంగా, సాంస్కృతికంగా ప్రాధాన్యం సంతరించుకుంది. రాజ్య రక్షణ కోసం నిర్మించిన ప్రాకారాలు, భారీ రాతి నిర్మాణాలు, అద్భుతమైన శిల్పాలు కాకతీయుల ఇంజినీరింగ్ ప్రతిభకు నిదర్శనంగా నిలిచాయి. కాకతీయుల పాలనలో వ్యవసాయం, చెరువుల నిర్మాణం, ఆలయ వాస్తుశిల్పం, కళలకు ప్రోత్సాహం లభించింది. అందుకే వరంగల్ కోటను కేవలం పురాతన కట్టడంగా కాకుండా తెలంగాణ సామాజిక, సాంస్కృతిక చరిత్రలో కీలకమైన వారసత్వ సంపదగా చూడాల్సిన అవసరం ఉంది.

### శిలాతోరణాలే ప్రత్యేక ఆకర్షణ...

వరంగల్ కోట పేరు వినగానే గుర్తుకొచ్చేవి నాలుగు దిక్కుల్లో నిలిచిన ప్రసిద్ధ కాకతీయ శిలాతోరణాలు. భారీ రాతి స్తంభాలు, సున్నితమైన శిల్పకళ, పురాతన ఆలయ అవశేషాలు సందర్శకులను ఆకట్టుకుంటాయి. కాకతీయుల నిర్మాణ శైలికి ప్రతీకగా నిలిచే ఈ తోరణాలు వరంగల్ నగరానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. ఒకప్పుడు రాజ్య వైభవానికి ప్రతీకగా నిలిచిన కోటలో ప్రస్తుతం కనిపించే శిథిలాలు గత చరిత్రను గుర్తుచేస్తున్నాయి. ప్రతి రాయి ఒక చరిత్రను చెబుతున్నట్లుగా, ప్రతి శిల్పం ఆనాటి కళాకారుల ప్రతిభను చాటుతున్నట్లుగా ఈ ప్రాంతం చరిత్రాభిమానులను ఆకర్షిస్తోంది.

### కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పరిరక్షణ పనులు...

చారిత్రక కట్టడాలను కాపాడటంలో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ (ఏఎస్ఐ) కీలక పాత్ర పోషిస్తోంది. వరంగల్ కోటలో రాతి ప్రాకారాల మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు 2026 మార్చి 19న రాజ్యసభకు సమర్పించిన కేంద్ర ప్రభుత్వ అధికారిక వివరాలు వెల్లడించాయి. ఈ పనులు కోటలో మిగిలి ఉన్న చారిత్రక నిర్మాణాలను కాపాడేందుకు ప్రాధాన్యం కల్పిస్తున్నాయి. అయితే కోట విస్తీర్ణం, నిర్మాణాల ప్రాచీనత, శిల్పాల విలువను దృష్టిలో ఉంచుకుని పరిరక్షణ పనులను నిరంతరం కొనసాగించాల్సిన అవసరం ఉంది. శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలను నిపుణుల పర్యవేక్షణలో పరిశీలించడం, దెబ్బతిన్న రాతి భాగాలకు శాస్త్రీయ పద్ధతుల్లో మరమ్మతులు చేయడం, పురాతన కట్టడాల అసలు స్వరూపం దెబ్బతినకుండా చూడటం ముఖ్యం. అలాగే కోట చరిత్రను సందర్శకులకు వివరించే సమాచార ఫలకాలు, వారసత్వ ప్రాధాన్యాన్ని తెలియజేసే ప్రదర్శనలు, సందర్శకుల సౌకర్యాల మెరుగుదల వంటి అంశాలపై కూడా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తే పర్యాటక అనుభవం మెరుగుపడుతుంది.తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన 2025-2030 పర్యాటక విధానంలో వరంగల్‌ను ప్రత్యేక వారసత్వ పర్యాటక ప్రాంతంగా గుర్తించింది. వరంగల్ కోట, కాకతీయ ఆలయాలు, పాకాల సరస్సు, గూడూరు వన్యప్రాణుల అభయారణ్యం వంటి ప్రాంతాలను కలిపి పర్యాటకాభివృద్ధికి అవకాశాలను పరిశీలించే దిశగా విధానం రూపొందించింది.రాష్ట్ర పర్యాటక విధానం ప్రకారం పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, సందర్శకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, సమాచార వ్యవస్థలను అభివృద్ధి చేయడం, ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ విధాన లక్ష్యాలను వరంగల్ కోటకు వర్తింపజేసేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తే ప్రాంతీయ పర్యాటక రంగానికి ప్రయోజనం చేకూరుతుంది. అయితే పర్యాటక విధానంలో వరంగల్‌ను చేర్చడం ఒక ముఖ్యమైన ముందడుగు మాత్రమే. కోటకు సంబంధించి ప్రత్యేకంగా ఏయే పనులు మంజూరయ్యాయి, వాటికి ఎంత నిధులు కేటాయించారు, పనులు ఎప్పటిలోగా పూర్తవుతాయి అనే వివరాలను సంబంధిత శాఖలు ప్రజలకు స్పష్టంగా వెల్లడించడం అవసరం.

### పర్యాటక అభివృద్ధితో స్థానికులకు ఉపాధి...

వరంగల్ కోటను చారిత్రక ప్రదేశంగానే కాకుండా పర్యాటక ఆకర్షణగా మరింత అభివృద్ధి చేసే అవకాశాలు ఉన్నాయి. కోట చరిత్రను వివరించే మార్గదర్శక సేవలు, డిజిటల్ సమాచార వ్యవస్థలు, విద్యార్థుల కోసం వారసత్వ సందర్శనలు, స్థానిక కళలు, హస్తకళల ప్రదర్శనలకు ప్రోత్సాహం వంటి చర్యలు పర్యాటక అనుభవాన్ని మెరుగుపరచగలవు.సందర్శకులకు అవసరమైన తాగునీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, పార్కింగ్, దిశా సూచికలు, విశ్రాంతి ప్రదేశాలు వంటి సదుపాయాలను మెరుగుపరచడం కూడా అవసరం. పర్యావరణానికి, పురాతన కట్టడాలకు హాని కలగకుండా ఈ సదుపాయాలను ఏర్పాటు చేయాలి. పర్యాటకుల రాక పెరిగితే స్థానిక యువతకు మార్గదర్శక సేవలు, రవాణా, ఆతిథ్య రంగం, స్థానిక ఉత్పత్తుల విక్రయాల ద్వారా ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంటుంది.

### ఆక్రమణలు, నిర్వహణపై ప్రత్యేక దృష్టి...

చారిత్రక ప్రదేశాల పరిరక్షణలో భూముల హద్దుల గుర్తింపు, అనధికార నిర్మాణాల నియంత్రణ, పరిశుభ్రత, సందర్శకుల క్రమశిక్షణ కీలకమైన అంశాలు. కోట పరిసరాల్లో ఆక్రమణలు లేదా ఇతర ఉల్లంఘనలపై ఫిర్యాదులు ఉన్నట్లయితే, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. కోటకు సంబంధించిన రక్షిత ప్రాంతాల హద్దులను స్పష్టంగా గుర్తించడం, పురావస్తు శాఖ, రెవెన్యూ, మున్సిపల్, పర్యాటక శాఖల మధ్య సమన్వయం పెంచడం ద్వారా పరిరక్షణ చర్యలను మరింత సమర్థంగా అమలు చేయవచ్చు. చారిత్రక కట్టడాలకు నష్టం కలిగించే చర్యలపై పర్యవేక్షణ ఉండాలి. అదే సమయంలో కోట పరిసరాల అభివృద్ధి పేరుతో అసలు చారిత్రక స్వరూపం దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయమే కీలకం... వరంగల్ కోట అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పురావస్తు పరిరక్షణ కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక విధాన లక్ష్యాలు పరస్పరం అనుసంధానమైతే మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంది. కేంద్రం చారిత్రక కట్టడాల పరిరక్షణపై దృష్టి సారిస్తే, రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక సదుపాయాలు, నగర అనుసంధానం, సందర్శకుల నిర్వహణ, ప్రచార కార్యక్రమాలపై సమగ్ర ప్రణాళిక రూపొందించవచ్చు.దీనికోసం కోట అభివృద్ధిపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక, దశలవారీ పనుల వివరాలు, నిధుల కేటాయింపులు, పనుల పురోగతిపై సమీక్షలు అవసరం. చరిత్రకారులు, పురావస్తు నిపుణులు, పర్యాటక రంగ ప్రతినిధులు, స్థానిక ప్రజల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటే అభివృద్ధి మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

### భావితరాలకు అందించాల్సిన వారసత్వం...

కాలం మారింది.. పాలకులు మారారు.. రాజ్యాలు కనుమరుగయ్యాయి. కానీ కాకతీయుల కళా వైభవానికి ప్రతీకగా నిలిచిన వరంగల్ కోట మాత్రం చరిత్రను తనలో దాచుకుని నేటికీ నిలిచివుంది. ఆ శిథిలాలు మనకు గతాన్ని గుర్తుచేస్తున్నాయి. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యతను కూడా గుర్తు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పరిరక్షణ పనులు, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పర్యాటకాభివృద్ధి విధానం క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలైతే వరంగల్ కోటకు మరింత గుర్తింపు తీసుకురావచ్చు. కాకతీయుల వారసత్వాన్ని కాపాడటమే కాకుండా, చరిత్రను తెలుసుకునే కొత్త తరాలకు ఈ కోటను సజీవ పాఠశాలగా అందించవచ్చు. కాకతీయుల వైభవం గతానికి చెందిన జ్ఞాపకం మాత్రమే కాదు తెలంగాణ భవిష్యత్తుకు గర్వకారణం. ఆ వారసత్వాన్ని కాపాడటం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు, సమాజం మొత్తానికి చెందిన చారిత్రక కర్తవ్యం.

# ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపీ గురి..

- **పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలి... డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి**

**నర్సంపేట, అక్టోబర్ 24 (సమయం న్యూస్) :**



బీజేపీ సంస్థాగత బలోపేతంతో పాటు రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నర్సంపేట పట్టణ, రూరల్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ భవిష్యత్ కార్యక్రమాలు, ఎన్నికల కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి నాయకుడు, కార్యకర్త క్రమశిక్షణతో, సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ పార్టీపై విశ్వాసాన్ని పెంపొందించాలని అన్నారు.రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పట్టణ, రూరల్ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. ప్రతి కార్యకర్తకు నిర్దిష్ట బాధ్యతలు అప్పగించి, ఎన్నికల కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఐక్యత, సమన్వయంతో పనిచేస్తే పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లవచ్చని తెలిపారు.సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, కార్యకర్తల బాధ్యతలు, ప్రజా సమస్యలపై పోరాటం, భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కోకన్వీనర్ కట్ల రామచందర్ రెడ్డి, నర్సంపేట పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, రూరల్ అధ్యక్షుడు తనుగుల అంబేద్కర్, నియోజకవర్గ నాయకుడు జూలూరు మనీష్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ జుర్రు రాజు, మాజీ ఎంపీటీసీ రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ గంగిడి మహేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు శీలం సత్యనారాయణ, ఎస్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జిరుపుల వీరన్న, సీనియర్ నాయకులు బాల్నే జగన్, కూనమల్ల పృథ్వీరాజ్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ యువ మోర్చా కన్వీనర్ పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, కోశాధికారులు, బూత్ అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు బందారపు అంజయ్య మృతి

- **యానాల దామోదర్ రెడ్డి.**

**వలిగొండ అక్టోబర్ 24 (సమయం న్యూస్)**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వేములకొండ గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ అంజయ్య అకాల మరణం లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. కామ్రేడ్ అంజయ్య పార్థివ దేహం పై ఎర్రజెండా కప్పి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కామ్రేడ్ అంజయ్య పేద కుటుంబంలో పుట్టినప్పటికీ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సిద్ధాంతాలకు ఆకర్షితులై పులిపలుపుల రామ లక్ష్మయ్య, ఖాజా మైనుద్దీన్, నీలం చెన్నయ్య లతో కలసి కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు. పదవుల కోసం ఆశపడకుండా పేద ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేసినారు. అతని మృతి కుటుంబానికి భారత కమ్యూనిస్టు పార్టీకి ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటని అతని మృతి పట్ల జిల్లా కమ్యూనిస్టు పార్టీ తరపున జోహార్లు అర్పించి కుటుంబానికి సానుభూతి తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు,



సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎల్లంకి మహేష్, శాఖ కార్యదర్శి పులిపలుపుల మల్లేశం, అంబటి అంజయ్య, ఏఐవైఎఫ్ మండల సహాయ కార్యదర్శి గుండెగాని నాగరాజుపాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఉన్న జర్నలిస్టు శ్రీనివాస్‌కు టీజేఏ జిల్లా అధ్యక్షుడు షానూర్ పరామర్శ

**భువనగిరి, అక్టోబర్ 24 (సమయం న్యూస్)**

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణానికి చెందిన నిజం రిపోర్టర్, తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గట్టికొప్పుల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ



సభ్యుడు మహమ్మద్ షానూర్ బాబా శనివారం శ్రీనివాస్ నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌కు మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో టీజేఏ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న, సభ్యుడు బలరాంపాల్గొన్నారు.

# భారత్‌కు విజయ 'తిలకం'..

**చివరి ఓవర్లలో అద్భుతం చేసిన తిలక్ వర్మ, నితీశ్ రెడ్డి**

- రెండో టీ20లోనూ టీమిండియా అద్భుత విజయం
- న్యూజిలాండ్ 20 ఓవర్లలో 180/5 స్కోరు
- గ్లెన్ ఫిలిప్స్ 70, బెవాన్ జాకబ్స్ 58 పరుగులు
- అర్ష్‌దీప్ సింగ్ ఖాతాలో రెండు వికెట్లు
- లక్ష్య ఛేదనలో భారత టాప్ ఆర్డర్ తడబాటు




**క్రైస్ట్‌చర్చ్, అక్టోబర్ 24 :** టీమిండియాకు ఓటమి తప్పదనుకున్న వేళ తెలుగు కుర్రాళ్లు అదరగొట్టారు. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డితో కలిసి భారత వైస్ కెప్టెన్ తిలక్ వర్మ అద్భుతం చేశాడు. చివరి ఓవర్లలో మెరుపు బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పి న్యూజిలాండ్‌పై టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. క్రైస్ట్‌చర్చ్‌లోని హాగ్లీ ఓవల్ వేదికగా శనివారం జరిగిన రెండో టీ20లో న్యూజిలాండ్ నిర్దేశించిన 181 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత జట్టు మధ్యలో తడబడినా.. తిలక్, నితీశ్ పోరాటంతో విజయాన్ని అందుకుంది. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బౌలింగ్ ఎంచుకున్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 180 పరుగులు చేసింది. ఆరంభంలో భారత బౌలర్లు పైచేయి సాధించారు. టిమ్ సీఫెర్ట్ (7), డారిల్ మిచెల్ (6), ఫిన్ అలెన్ (16) త్వరగా వెనుదిరిగారు. అర్ష్‌దీప్ సింగ్ రెండు వికెట్లు తీయగా.. ప్రిన్స్ యాదవ్, భువనేశ్వర్ కుమార్, నితీశ్ కుమార్ రెడ్డి చెరో వికెట్ పడగొట్టారు. అయితే గ్లెన్ ఫిలిప్స్, బెవాన్ జాకబ్స్ భారత బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. ఫిలిప్స్ 43 బంతుల్లో 70 పరుగులు చేయగా, జాకబ్స్ 46 బంతుల్లో 58 పరుగులతో రాణించాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 116 పరుగులు జోడించి న్యూజిలాండ్‌ను పటిష్ఠ స్థితికి చేర్చారు. చివర్లో మైకేల్ బ్రేస్‌వెల్ రెండు బంతుల్లోనే 10 పరుగులు చేయడంతో ఆతిథ్య జట్టు 180 పరుగుల స్కోరు సాధించింది. 181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. సంజూ శాంసన్ (14), వైభవ్ సూర్యవంశీ (4) త్వరగా ఔటయ్యారు. అభిషేక్ శర్మ (27), శ్రేయస్ అయ్యర్ (7) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. దీంతో భారత్ పరుగుల కోసం ఇబ్బంది పడింది. కీలక సమయంలో వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్ న్యూజిలాండ్ చేతుల్లోకి వెళ్లినట్లు కనిపించింది. ఆ సమయంలో తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి (26 నాటౌట్) బాధ్యత తీసుకున్నారు. తిలక్ (51 నాటౌట్: 6 ఫోర్లు, 1 సిక్స్) తనదైన శైలిలో బౌండరీలు బాదుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించగా, నితీశ్ భారీ షాట్లతో అతడికి అండగా నిలిచాడు. చివరి ఓవర్లలో వీరిద్దరి దూకుడుతో భారత్ విజయానికి చేరువైంది. చివరి ఓవర్‌కు ముందు 10 పరుగులు అవసరమైన దశలోనూ ఒత్తిడికి లోనుకాకుండా ఆడిన ఈ జోడీ లక్ష్యాన్ని అందుకుంది. ఈ విజయంతో భారత్ ఐదు టీ20ల సిరీస్‌లో 2-0 ఆధిక్యాన్ని అందుకుంది. తొలి మ్యాచ్‌లోనూ న్యూజిలాండ్ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని ఛేదించిన టీమిండియా, రెండో మ్యాచ్‌లోనూ ఒత్తిడిని తట్టుకుని గెలవడం విశేషం. కీలక సమయంలో తెలుగు కుర్రాళ్లు తిలక్ వర్మ చూపిన పోరాటం, నితీశ్ రెడ్డి ఇచ్చిన సహకారం భారత విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి.






# పాకిస్థాన్‌లో మహిళల టీ20 వరల్డ్ కప్..

**దుబాయ్‌లో భారత్ వర్సెస్ పాక్ మ్యాచ్!**

**లాహోర్, అక్టోబర్ 24 :** 2028 మహిళల టీ20 వరల్డ్ కప్ నిర్వహణపై ఆసక్తికర అప్‌డేట్ వెలువడింది. ఈ టోర్నమెంట్‌ను పాకిస్థాన్ పూర్తిగా తమ దేశంలోనే నిర్వహించాలని చూస్తుండగా, భారత్ ఆడే మ్యాచ్‌లకు మాత్రం యూఏఈ (దుబాయ్) వేదిక కానుంది. 2028 సెప్టెంబర్ 7 నుంచి అక్టోబర్ 1 వరకు జరగబోయే ఈ టోర్నమెంట్‌కు పాకిస్థాన్ మెయిన్ హోస్ట్‌గా వ్యవహరించనుంది. అయితే భారత్-పాకిస్థాన్ మధ్య ఉన్న రాజకీయ పరిస్థితుల కారణంగా గతంలో కుదిరిన హైబ్రిడ్ మోడల్ నిబంధనలే వర్తిస్తాయని ఐసీసీ స్పష్టం చేయడంతో.. భారత జట్టు ఆడే మ్యాచ్‌లను దుబాయ్‌కి మార్చాలని పీసీబీ భావిస్తోంది. భారత్ మ్యాచ్‌లు మినహా గ్రూప్ దశలోని మిగతా మ్యాచ్‌లు, నాకౌట్ మ్యాచ్‌లన్నింటినీ పాకిస్థానే నిర్వహించనుంది. ఒకవేళ ఫైనల్ చేరే జట్లలో భారత్ లేకపోతే లాహోర్‌లోనే ఫైనల్ నిర్వహించాలని యోచిస్తున్నారు. దీనిపై ఐసీసీ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. గతంలో 2025 చాంపియన్స్ ట్రోఫీ, 2023 ఆసియా కప్ వంటి టోర్నీల్లోనూ ఇదే హైబ్రిడ్ ఫార్ములాను అమలు చేసిన విషయం తెలిసిందే.

# ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో పీవీ సింధు

- మరో సూపర్ 750 టైటిల్‌పై కన్ను
- మూడు గేమ్‌ల పోరులో జపాన్ షట్లర్‌పై విజయం
- 38 షాట్ల ర్యాలీతో మ్యాచ్‌లో కీలక మలుపు
- ఫైనల్లో అన్ సే-యంగ్‌తో టైటిల్ పోరు

**రెండో గేమ్ కోల్పోయినా పుంజుకున్న భారత స్టార్**




**పారిస్, అక్టోబర్ 24 :** భారత స్టార్ షట్లర్, రెండుసార్లు ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధు ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో జరుగుతున్న ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 టోర్నీలో ఫైనల్‌కు దూసుకెళ్లారు. శనివారం (అక్టోబర్ 24) జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 22వ ర్యాంకర్, జపాన్ క్రీడాకారిణి హీనా అకేచిపై సింధు అద్భుత విజయం సాధించారు. గంటా 13 నిమిషాల పాటు ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో 21-10, 20-22, 21-16 తేడాతో విజయం సాధించి, ఈ ఏడాది తన రెండో సూపర్ 750 ఫైనల్‌లో అడుగుపెట్టారు. గత జులైలో జపాన్ ఓపెన్ టైటిల్ నెగ్గిన సింధుకు ఇది ఈ ఏడాది మరో పెద్ద విజయం.

**తొలి గేమ్‌లో సింధు ఏకపక్ష ఆధిపత్యం**

తొలి గేమ్ ప్రారంభంలో ఇరు క్రీడాకారిణులు హోరాహోరీగా తలపడటంతో స్కోరు 4-4, 8-8తో సవ-ంమైంది. ఆ తర్వాత లయ అందుకని 11-9 ఆధిక్యంతో విరామానికి వెళ్లిన భారత స్టార్, ఆ తర్వాత ఊహించని రీతిలో చెలరేగిపోయారు. కేవలం 18 నిమిషాల్లోనే వం-సగా 12 పాయింట్లలో 11 పాయింట్లు ఖాతాలో వేసుకుని 21-10 తేడాతో తొలి గేమ్‌ను సునాయసంగా కైవసం చేసుకున్నారు.

**రెండో గేమ్‌లో జపాన్ క్రీడాకారిణి బలమైన కంబాక్**

రెండో గేమ్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ సింధుకు గట్టి పోటీ ఎదురైంది. మొదట్లో నాలుగు పాయింట్లు వెనుకబడినప్పటికీ, సింధు తిరిగి పుంజుకుని స్కోరును 7-7తో సమం చేశారు. తన పవర్ ఫుల్ షాట్లు, క్రాస్ కోర్ట్ దాడులతో స్కోరును 14-14, 16-16తో రసవత్తరంగా మార్చారు. అయితే, ఆఖరి నిమిషాల్లో జపాన్ షట్లర్ తీవ్రంగా పోరాడి గేమ్ పాయింట్ సాధించింది. మొదటి గేమ్ పాయింట్‌ను సింధు కాపాడుకున్నప్పటికీ, ఆ తర్వాత చేసిన చిన్న పొరపాటుతో రెండో గేమ్‌ను 20-22తో అకేచి కైవసం చేసుకుంది.

**నిర్ణయాత్మక మూడో గేమ్.. 38 షాట్ల ర్యాలీతో మ్యాచ్ తిరిగిన మలుపు**

ఫైనల్ బెర్తును తేల్చే మూడో గేమ్ తీవ్ర ఉత్కంఠ నడుమ సాగింది. 5-3 ఆధిక్యంతో నిలిచిన సింధును జపాన్ క్రీడాకారిణి నెట్ ప్లేతో గట్టి సవాల్ విసిరి స్కోరును 15-15తో సమం చేసింది. అయితే, మ్యాచ్‌కు అసలైన మలుపు తిరిగింది 18-16 వద్ద జరిగిన సుదీర్ఘమైన 38 షాట్ల ర్యాలీతోనే! అకేచి చేసిన నెట్ ఎర్రర్ వల్ల ఈ పాయింట్ సింధు ఖాతాలో పడింది. అదే ఉత్సాహంతో సింధు వరుస పాయింట్లు సాధించి 4 మ్యాచ్ పాయింట్లు సాధించారు. ఆఖరిగా పవర్ ఫుల్ క్రాస్ కోర్ట్ స్మాష్‌తో గేమ్‌ను 21-16తో ముగించి ఫైనల్ పిలుపు అందుకున్నారు.

**ఫైనల్లో ప్రపంచ నంబర్ 1 అన్ సే-యంగ్ తో పోరు..**

ఆదివారం జరగనున్న టైటిల్ పోరులో ప్రపంచ నంబర్ వన్, దక్షిణ కొరియా స్టార్ షట్లర్ అన్ సే-యంగ్‌తో సింధు తలపడనున్నారు. ఫైనల్ మ్యాచ్‌పై సింధు స్పందిస్తూ.. "ఫైనల్‌కు చేరుకోవడం సంతోషంగానే ఉంది, కానీ పని ఇంకా పూర్తి కాలేదు. ఫైనల్‌పై దృష్టి సారించాల్సి ఉంది. ఆమె ప్రస్తుతం అత్యుత్తమ ఫామ్‌లో ఉంది. గతంలో మేము చాలాసార్లు తలపడ్డాం. రేపు సరికొత్త రోజు, ప్రతి పాయింట్ ముఖ్యం. మైదానంలో నా అత్యుత్తమ ప్రదర్శన ఇస్తూ ఆమెకు గట్టి పోటీ ఇస్తాను" అని స్పష్టం చేశారు. గాయాలు, ఫామ్ లేమితో ఇబ్బంది పడిన సమయం నుంచి కోలుకోవడానికి కొత్త సపోర్ట్ టీమ్, శిక్షణ పద్ధతుల్లో చేసిన మార్పులు ఎంతగానో ఉపయోగపడ్డాయని సింధు ఈ సందర్భంగా వెల్లడించారు.




# అర్ష్‌దీప్ సింగ్ సరికొత్త రికార్డ్..

**భువనేశ్వర్‌ను అధిగమించిన యువ పేసర్!**

**ఒకే ఏడాదిలో అత్యధిక టీ20 వికెట్లు తీసిన భారత బౌలర్‌గా అర్ష్‌దీప్**

**భువనేశ్వర్ కుమార్ 37 వికెట్ల రికార్డును అధిగమించిన పంజాబ్ పేసర్**

**2026లో ఇప్పటివరకు 38 వికెట్లు పడగొట్టిన అర్ష్‌దీప్ సింగ్**

**న్యూజిలాండ్‌తో రెండో టీ20లో ఈ అరుదైన ఘనత సాధన**

**క్రైస్ట్‌చర్చ్, అక్టోబర్ 24:** భారత యువ ఎడమచేతి వాటం పేసర్ అర్ష్‌దీప్ సింగ్ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో ఒకే క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన భారత బౌలర్‌గా సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ క్రమంలో సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ పేరిట ఉన్న రికార్డును అతను అధిగమించాడు. న్యూజిలాండ్‌తో శనివారం హేగ్లీ ఓవల్ మైదానంలో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో ఈ ఘనతను అందుకున్నాడు. ఈ మ్యాచ్‌లో అర్ష్‌దీప్ సింగ్ 33 పరుగులిచ్చి 2 కీలక వికెట్లు తీశాడు. దీంతో 2026 క్యాలెండర్ సంవత్సరంలో అతని వికెట్ల సంఖ్య 38కి చేరింది. ఇంతకుముందు ఈ రికార్డు భువనేశ్వర్ కుమార్ పేరిట ఉండేది. భువనేశ్వర్ 2022 సీజన్ లో 37 వికెట్లు తీశాడు. విశేషమేమిటంటే, భువీ 31 ఇన్నింగ్స్‌లలో ఈ ఘనత సాధించగా, అర్ష్‌దీప్ కేవలం 26 ఇన్నింగ్స్‌లలోనే ఈ మార్కును దాటడం అతని నిలకడకు నిదర్శనం. ఈ మ్యాచ్‌లో తొలుత టిమ్ సీఫర్ట్‌ను ఔట్ చేసి న్యూజిలాండ్‌కు తొలి దెబ్బతీసిన అర్షదీప్, ఆ తర్వాత ప్రమాదకరంగా మారుతున్న గ్లెన్ ఫిలిప్స్ (70) వికెట్‌ను కూడా పడగొట్టి రికార్డును సొంతం చేసుకున్నాడు. ఒక దశలో 41 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన కివీస్‌ను, గ్లెన్ ఫిలిప్స్, బెవాన్ జాకబ్స్ (58) నాలుగో వికెట్‌కు 116 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకున్నారు. దీంతో న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 180 పరుగులు చేయగలిగింది. ఈ ప్రదర్శనతో, ఒక క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక టీ20 వికెట్లు తీసిన ప్రపంచ బౌలర్ల జాబితాలో అర్ష్‌దీప్ మూడో స్థానానికి చేరాడు. ఐర్లాండ్‌కు చెందిన జాష్ లిటిల్ (39 వికెట్లు, 2022), శ్రీలంక స్పిన్నర్ వనిందు హసరంగ (38 వికెట్లు, 2024) అతని కంటే ముందున్నారు.

# 'కాంతార' బ్యూటీ ఎమోషనల్ పోస్ట్!

**హైదరాబాద్, అక్టోబర్ 24 :** కన్నడ యువ నటి రుక్మిణి వసంత్ వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. ముఖ్యంగా 'కాంతార: చాప్టర్ 1'లో అవకాశం దక్కించుకున్న తర్వాత దక్షిణాది చిత్ర పరిశ్రమలో ఆమెకు క్రేజ్ విపరీతంగా పెరిగింది. ఈ క్రమంలోనే తాజాగా ఆమె ఒక కొత్త చిత్రంలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. 'ఒకే ఒక జీవితం' ఫేమ్ శ్రీ కార్తీక్ ఈ చిత్రంలో నటిస్తూ దర్శకత్వం వహిస్తుండగా, ఈ సినిమాకు సంబంధించి అధికారిక ప్రకటన వెలువడింది. ఈ కొత్త ప్రాజెక్ట్ గురించి రుక్మిణి వసంత్ సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగపూరితమైన పోస్ట్‌ను పంచుకున్నారు. "తొలిసారి కథ విన్నప్పటి నుంచే ఈ సినిమాపై మా బృందంలో ఎంతో ఉత్సాహం నెలకొంది. సెట్‌లోకి అడుగుపెట్టే ప్రతి క్షణం ఎంతో ఉత్కంఠగా అనిపించింది. ఈ సానుకూల వాతావరణం నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది" అని ఆమె పేర్కొన్నారు. ఈ చిత్రంలో ఆమె 'తార' అనే ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. మ్యాడ్ బాయ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్, సిరుణి సినీ కార్పొరేషన్స్ సంయుక్త నిర్మాణంలో వస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన పవర్‌ఫుల్ టైటిల్‌ను త్వరలోనే ప్రకటించనున్నారు.











# కరీంనగర్ మట్టిలో 'శనార్తి' సందడి..

## మొదలైన సినిమా షూటింగ్!

**కరీంనగర్, అక్టోబర్ 24 :** టాలీవుడ్‌లో పక్కా లోకల్, రా అండ్ రస్టిక్ కథలతో తనదైన ముద్ర వేసిన ప్రముఖ దర్శకుడు, నిర్మాత సంపత్ నంది మరో అదిరిపోయే ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. సోషల్ మీడియాలో విపరీతమైన ఫాలోయింగ్ ఉన్న 'రాజ్ వెడ్స్ రాంబాయ్' ఫేమ్ అఖిల్ రాజ్, 'ఫోక్ క్వీన్' నాగదుర్గలను హీరోహీరోయిన్లుగా పరిచయం చేస్తూ తెరకెక్కిస్తున్న సరికొత్త చిత్రం 'శనార్తి' రెగ్యులర్ షూటింగ్ కరీంనగర్ జిల్లాలో గ్రాండ్‌గా ప్రారంభమైంది. ఆదిత్య మూవీస్ సమర్పణలో సంపత్ నంది టీమ్ వర్క్స్, శ్రీ ధనలక్ష్మి ప్రొడక్షన్స్ బ్యానర్లపై కే.వి. శ్రీధర్ రెడ్డి, సంపత్ నంది సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కరీంనగర్ జిల్లా వెలిచాలలో డైరెక్టర్ సంపత్ నంది, ప్రొడ్యూసర్ శ్రీధర్ రెడ్డి సమక్షంలో ఈ సినిమా పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న గణేష్ రాజ్ ఉప్పునూటి స్వస్థలం కరీంనగర్ జిల్లాలోని గట్టు బూత్కూర్ కావడం విశేషం. ఒక యువ దర్శకుడు తన తొలి సినిమాను సొంత ఊరి వాతావరణంలోనే సుమారు నెల రోజుల పాటు చిత్రీకరిస్తున్నారు. తెలంగాణ సంప్రదాయాలు, మట్టి వాసనలను వెండితెరపైకి తీసుకురాబోతున్న ఈ చిత్రానికి సురేష్ బొబ్బిలి సంగీతం అందిస్తుండగా, విశ్వనాథ్ రెడ్డి సినిమాటోగ్రఫీ, బేబీ సురేష్ భీమగాని ఆర్ట్ డైరెక్షన్‌గా వ్యవహరిస్తున్నారు. మై విలేజ్ షో రాజు, మురళీధర్ గౌడ్, సునందిని, సుంకర లక్ష్మి, రమేష్ నకిరికంటి, వైవా రెడ్డి, అంజి బాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# ఎయిర్‌పోర్ట్‌లో చుట్టుముట్టి తాకారు

## నటి అనుపమ పరమేశ్వరన్ ఆవేదన!

**హైదరాబాద్, అక్టోబర్ 24:**

ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ తనకు ఎయిర్‌పోర్ట్‌లో ఎదురైన ఓ చేదు అనుభవాన్ని తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పంచుకున్నారు. కొందరు వ్యక్తులు తనను చుట్టుముట్టి, అనుమతి లేకుండా ఫొటోలు తీయడమే కాకుండా అసభ్యంగా తాకారంటూ ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను మానసికంగా ఎంతో ఇబ్బంది పెట్టిందని తెలిపారు. ఇటీవల ఓ ఎయిర్‌పోర్ట్‌లో లగేజీ కోసం ఒంటరిగా వేచి చూస్తున్న సమయంలో ఈ సంఘటన జరిగిందని అనుపమ వివరించారు. క్షణాల్లో జనం తనను చుట్టుముట్టి హద్దులు మీరారని, ఆ సమయంలో ఏం చేయాలో పాలుపోలేదని పేర్కొన్నారు. అభిమానులతో ఫొటోలు దిగడానికి ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ కొందరు ప్రవర్తించే తీరు తీవ్ర ఆందోళన కలిగిస్తోందని స్పష్టం చేశారు. సమాజంలో సాధారణ మహిళలు కూడా నిత్యం ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి ధైర్యాన్ని మెచ్చుకోవాలని అనుపమ అభిప్రాయపడ్డారు.



## టాలీవుడ్‌లోకి 'సైయారా'

# బ్యూటీ ఎంట్రీ?

**హైదరాబాద్, అక్టోబర్ 24 :** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కనున్న క్రేజీ ప్రాజెక్ట్ 'ఆర్సీ17'పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ సినిమా ఇంకా అధికారికంగా ప్రారంభం కాకముందే సోషల్ మీడియాలో రకరకాల వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇప్పటికే సంగీత దర్శకుడిగా అనిరుద్ ఖరారవ్వగా, తాజాగా హీరోయిన్ ఎంపిక అంశం చర్చనీయాంశంగా మారింది. చరణ్‌కు జోడీగా బాలీవుడ్ భామను తీసుకోవాలని భావిస్తున్న సుకుమార్.. ఈ క్రమంలో తాజాగా 'సైయారా' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న యువ హీరోయిన్ అనీత్ పడ్డా పేరు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. బాలీవుడ్‌లో 'సైయారా' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న అనీత్ పడ్డా.. ఇటీవల హైదరాబాద్‌లో ప్రత్యక్షం కావడంతో ఈ ఊహాగానాలు మరింత ఊపందుకున్నాయి. ఆమె ఈ ప్రాజెక్ట్ కోసమే నగరానికి వచ్చారంటూ అభిమానులు చర్చించుకుంటున్నారు. గతంలో కియారా అద్వానీ, సారా అర్జున్ పేర్లు వినిపించగా, ఇప్పుడు అనీత్ పేరు తెరపైకి వచ్చింది. ఇదిలాఉంటే, 'ఆర్సీ17' సినిమా పూజా కార్యక్రమాలను అక్టోబర్ 26 లేదా 27 తేదీల్లో నిర్వహించనున్నట్లు నిర్మాత మైత్రి రవి ఇటీవల వెల్లడించిన నేపథ్యంలో.. చిత్రంలో నటించే హీరోయిన్పై త్వరలోనే అధికారిక స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# దీపికా పదుకొణే.. బ్యాక్ టు షూట్!



**ముంబై, అక్టోబర్ 24:** బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణే మరోసారి కెమెరా ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. రెండోసారి తల్లి అయిన తర్వాత కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్న ఈ స్టార్ బ్యూటీ.. ఇప్పుడు తన పెండింగ్ షూటింగ్స్‌ను పూర్తి చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. షారుఖ్ ఖాన్ నటిస్తున్న 'కింగ్', అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' సినిమాల్లో తనకు సంబంధించిన సన్నివేశాలను ఆమె పూర్తి చేయనున్నారు. ప్రెగ్నెన్సీ సమయంలోనూ షూటింగ్స్‌లో పాల్గొన్న దీపికా.. డెలివరీ సమయం దగ్గరపడటంతో కొంతకాలం విరామం తీసుకున్నారు. ఇటీవల మరో పాపకు జన్మనిచ్చిన ఆమె, ప్రస్తుతం మాతృత్వాన్ని ఆస్వాదిస్తూనే మళ్లీ సినిమాలపై దృష్టి పెట్టారు. అక్టోబర్ 26 నుంచి షారుఖ్ ఖాన్ 'కింగ్' సినిమా షూటింగ్‌లో దీపిక పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఈ షెడ్యూల్‌లో భాగంగా ముంబైలో ఓ పాటను చిత్రీకరించనుండగా, ప్రముఖ కొరియోగ్రాఫర్ వైభవి మర్చంట్ ఈ సాంగ్‌కు కొరియోగ్రఫీ చేయనున్నారు. మొదట ఈ పాటను దక్షిణాఫ్రికాలో తీయాలని భావించినప్పటికీ, దీపికా కాల్షీట్స్‌ను దృష్టిలో పెట్టుకుని లొకేషన్‌ను ముంబైకి మార్చినట్లు సమాచారం. 'కింగ్' పూర్తయ్యాక 'రాకా' సెట్స్‌లోకి ఆమె అడుగుపెట్టనున్నారు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNIVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో సర్పంచులకే ప్రాధాన్యం

- **జీవో 33, హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలి... డా.బానోతు సారంగపాణి**

**నల్లబెల్లి, అక్టోబర్ 24 (సమయం న్యూస్) :**



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను ప్రభుత్వ జీవో నంబర్ 33, హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా గ్రామసభల ద్వారా పారదర్శకంగా చేపట్టాలని బీఆర్ఎస్ నల్లబెల్లి మండల అధ్యక్షుడు డాక్టర్ బానోతు సారంగపాణి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్ డిమాండ్ చేశారు. శనివారం నల్లబెల్లిలోని బీఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.గ్రామపంచాయతీ ఎన్నికలు జరిగి సర్పంచులు బాధ్యతలు చేపట్టినప్పటికీ, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో వారికి తగిన ప్రాధాన్యం కల్పించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ జీవోకు విరుద్ధంగా సర్పంచులను పక్కనపెట్టి కమిటీ సభ్యుల ద్వారా ఎంపిక ప్రక్రియ కొనసాగిస్తున్నారని ఆరోపించారు.లబ్ధిదారుల ఎంపికలో సర్పంచులకు బాధ్యతలు కల్పించాలని కోరుతూ నల్లబెల్లి సర్పంచుల ఫోరం హైకోర్టును ఆశ్రయించిందని తెలిపారు. సర్పంచులకు అనుకూలంగా కోర్టు ఆదేశాలు వచ్చినప్పటికీ అధికారులు వాటిని అమలు చేయకుండా ఎంపిక ప్రక్రియ కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు, న్యాయస్థానం ఆదేశాలను గౌరవించి గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేయాలని కోరారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం పేరుతో కొందరు అధికార పార్టీ నాయకులు ప్రొసీడింగ్స్ చూపిస్తూ పేదల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ వ్యవహారంపై జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.జీవో 33, హైకోర్టు ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఎంపిక ప్రక్రియను నిలిపివేసి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మండలవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో సర్పంచుల ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు పులి రమేష్ గౌడ్, జాటోర రవి చిన్న, గౌరవాధ్యక్షుడు మచ్చిక రవి, క్లస్టర్ ఇన్‌చార్జి ఇంగ్లీ శివాజీ, సర్పంచులు దండెం సంపత్, నాగలి జ్యోతి ప్రకాష్, మంద సుజాత రాజిరెడ్డితోపాటు మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల, గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సేవలో యాదాద్రి జిల్లా టాస్కా ఆదర్శం

- **ఉత్తమ సేవలందించిన సీనియర్ సిటిజన్లకు ఆర్డీవో కృష్ణారెడ్డి సన్మానం**
- **తల్లిదండ్రులను గౌరవించాలి.. వేధిస్తే చట్టపరమైన చర్యలు: ఆర్డీవో**
- **త్వరలో జిల్లా టాస్కా ఆధ్వర్యంలో సావనీర్ విడుదల**

**ఆలేరు, అక్టోబరు 24(సమయం న్యూస్)**

వయోవృద్ధుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం యాదాద్రి భువనగిరి జిల్లా తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (టాస్కా) చేస్తున్న సేవలు అభినందనీయమని భువనగిరి ఆర్డీవో ఎం. కృష్ణారెడ్డి అన్నారు. వయోవృద్ధుల సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తూ, వివిధ మండలాల్లో సేవలందిస్తున్న సీనియర్ సిటిజన్లను గుర్తించి సత్కరించడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. జిల్లా టాస్కా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఉత్తమ సేవలందించిన ఎనిమిది మందిని ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కృష్ణారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేయడం, వేధించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైన సందర్భాల్లో చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా ఆస్తుల విషయంలోనూ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తల్లిదండ్రులు జీవించి ఉన్నప్పుడే వారికి తగిన గౌరవం, ప్రేమాభిమానాలు అందించాలని సూచించారు. వయోవృద్ధులు ఆత్మగౌరవంతో జీవించేలా కుటుంబ సభ్యులు, సమాజం బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల సంక్షేమం కోసం స్వచ్ఛందంగా సేవలందిస్తున్న వారిలో భువనగిరికి చెందిన బండారు బిక్షపతిరెడ్డి, శ్రీరామ్ సత్తయ్య, బింగి భిక్షపతి, కూచిపాట్ల సత్యనారాయణరెడ్డి, కరిపె నర్సింగరావు, దొంతి లక్ష్మణ్, నారాయణపూర్ మండలానికి చెందిన ఎం.డి. గౌస్ ఖురేషి, పోచంపల్లికి చెందిన తడక రమేష్‌లను ఆర్డీవో సత్కరించారు. వయోవృద్ధుల సంక్షేమానికి వారు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా అభినందించారు.తల్లిదండ్రుల ఆస్తుల



విషయంలో ఆచితూచి వ్యవహరించాలిజిల్లా టాస్కా అధ్యక్షుడు ఎర్రగుంట వెంకటేశం మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ జీవితకాలంలో ఆస్తుల బదలాయింపు విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరాన్నిబట్టి చట్టపరమైన సలహాతో వీలునామా రాసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వయోవృద్ధుల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం కోసం టాస్కా నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. జిల్లా సంఘం ఆధ్వర్యంలో త్వరలో సావనీర్ విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. డివిజన్ పాలనాధికారి మందడి ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ వయోవృద్ధులకు ప్రభుత్వపరంగా, సామాజికంగా అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. తల్లిదండ్రుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా టాస్కా ప్రధాన కార్యదర్శి దర్గాయి నర్సింగరావు, ఉపాధ్యక్షుడు సాదినేని దశరథ, బొమ్మలరామారం మండల అధ్యక్షుడు ఎల్లబోయిన భిక్షపతి, ఆత్మకూరు మండల అధ్యక్షుడ, రాజాపేటకు చెందిన రాపోలు రామచంద్రరెడ్డి, ఆలేరు మండల జిల్లా కోఆర్డినేటనారాయణపురం మండలానికి చెందిన ఎం.డి. యాదగిరిగుట్టకు చెందిన గుంటి యాదగిరి, భువనగిరి మండల టాస్కా అధ్యక్షుడు పసల రోమన్ తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు

- **ఈనెల 25 నుండి శిక్షణ శిబిరాలు**
- **శిక్షణ ప్రోగ్రాం పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి సమయం న్యూస్ 24:**



సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి గ్రామంలోని తెలంగాణ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల (TGRS & JC)లో స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు రాష్ట్రస్థాయి శిక్షణాధికారులచే ఈనెల 25 నుండి బేసిక్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నట్లు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి వి. మాధవరెడ్డి తెలిపారు. మొదటి విడత శిక్షణ శిబిరం అక్టోబర్ 25 నుంచి 31 వరకు, రెండవ విడత శిక్షణ శిబిరం నవంబర్ 1 నుంచి 7 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి, రెండవ విడతలలో వివిధ జిల్లాలకు చెందిన స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు పాల్గొననున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్ పాండు బేసిక్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రెజరర్ జి. సుందర్ రావు జిల్లా కార్యదర్శి వి. మాధవరెడ్డి, జాయింట్ సెక్రటరీ ఎం. శోభ, జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్లు చంద్రశేఖర్ గౌడ్, వందన, పాల్గొన్నారు.

# సంప్రదాయాల సమ్మేళనం.. ముదిరాజుల ఆత్మీయ అలయ్ బలయ్!

- **నేడు ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో 94వ దసరా సమ్మేళనం**
- **ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్**
- **నవాడ ముత్తయ్య జయంతి, సత్యనారాయణ స్వామి వ్రతం, యువతీ యువకుల వివాహ పరిచయ వేదిక**

**హైదరాబాద్, అక్టోబరు 24 (సమయం న్యూస్)**



సంప్రదాయాల పరిరక్షణ.. బంధుమిత్రుల ఆత్మీయ పలకరింపులు.. ఐక్యతను చాటే అలయ్ బలయ్.. ఆధ్యాత్మిక శోభ నడుమ ముదిరాజుల 94వ దసరా సమ్మేళనం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో నేడు (ఆదివారం) సికింద్రాబాద్ న్యూ బోయిగూడలోని ముదిరాజ్ భవన్‌లో ఈ వేడుకలు జరగనున్నాయిఈ సందర్భంగా ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు గౌడుగు ఆంజనేయులు ముదిరాజ్ మాట్లాడుతూ దసరా సమ్మేళనంతోపాటు ముదిరాజుల అలయ్ బలయ్, నవాడ ముత్తయ్య జయంతి వేడుకలు, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, ముదిరాజ్ యువతీ యువకుల వివాహ పరిచయ వేదికను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంతోపాటు సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. పెద్దల ఆశీస్సులు పొందుతూ, సంప్రదాయాలను గుర్తుచేసుకుంటూ, పరస్పర ఆత్మీయతను పంచుకునే ఈ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.ముదిరాజ్ యువతీ యువకుల కోసం ఏర్పాటు చేస్తున్న వివాహ పరిచయ వేదిక ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ఒకే వేదికపై కుటుంబాలు పరస్పరం పరిచయం చేసుకునేందుకు, తగిన జీవిత భాగస్వామిని ఎంచుకునే దిశగా తొలి అడుగు వేయడానికి ఇది ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు.నగరంలోని ముదిరాజ్ బంధువులందరూ కుటుంబ సమేతంగా హాజరై, ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని గౌడుగు ఆంజనేయులు ముదిరాజ్ కోరారు.

# కొత్త పింఛన్లు ఏవీ?.. రైతుల కష్టాలు పట్టవా?

- **కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎంపీ రఘునందన్‌రావు విమర్శలు**
- **రాయపోల్ మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**రాయపోల్, అక్టోబర్ 24: (సమయం న్యూస్)**

హామీలు అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మెదక్ ఎంపీ రఘునందన్‌రావు విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. శనివారం రాయపోల్ మండలంలోని ఎల్కల్, వడ్డేపల్లి, వీరారెడ్డిపల్లి, వీరానగర్, కొత్తపల్లి, కృష్ణసాగర్, ఆరెపల్లి గ్రామాల్లో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుంది అనే ఉద్దేశం తో కేంద్ర ప్రభుత్వం నిధుల ద్వారానే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నయన్నారు. దసరాలోపు కొత్త పింఛన్లు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఎంపీ విమర్శించారు. హామీలు ఇచ్చి ప్రజల్లో ఆశలు కల్పించడం తప్ప వాటిని అమలు చేయడంలో చిత్తశుద్ధి చూపడం లేదన్నారు. పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన పేదలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.విద్యుత్ సమస్యలతో రైతుల అవస్థలుగ్రామాల్లో విద్యుత్ సరఫరా సమస్యల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రఘునందన్‌రావు అన్నారు. సరైన సమయంలో విద్యుత్ అందక పంటలు దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతుల కష్టాలను గుర్తించి విద్యుత్ సమస్యలను పరిష్కరించడంతోపాటు వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు వెంకటయ్య,రేణుక రాజాగౌడ్,సుగుణ రొయ్యల శ్రీను,శశి కాంత్,శ్యామల మల్లేశం,దివ్య కృష్ణ,బిజెపి జిల్లా అధ్యక్షులు బైరీ శంకర్,మండల అధ్యక్షులు మంకిడి స్వామి,మాజీ అధ్యక్షులు వెంకట్ గౌడ్,ఉపసర్పంచ్ వీరేష్, నాయకులు విభిషన్ రెడ్డి,రాజీ రెడ్డి, నిల స్వామి,గజ్వేల్ రామచంద్రం, గణేష్,స్వామి. లక్మన్,చందు,నర్సింలు,తదితరులు పాల్గొన్నారు.



## వన్యప్రాణుల సంరక్షణకు పోలీసు,అటవీ శాఖల సమన్వయం

- **ఎస్పీ అఖిల్ మహాజన్**

**ఆదిలాబాద్, అక్టోబర్ 24( సమయం న్యూస్/**

వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ కోసం పోలీసు, అటవీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు.వన్యప్రాణుల వేట, కలప స్మగ్లింగ్, అక్రమ విద్యుత్ వైర్ల ఏర్పాటు, గంజాయి సాగు వంటి అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వన్యప్రాణుల కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా సాక్ష్యాధారాలను పకడ్బందీగా సేకరించి దర్యాప్తు చేపట్టాలని సూచించారు.పోలీసు, అటవీ శాఖ అధికారుల కోసం నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడారు. రెండు శాఖలు సమాచారాన్ని పరస్పరం పంచుకుంటూ నిరంతరం నిఘా ఉంచాలని, కేసుల దర్యాప్తు నుంచి కోర్టు విచారణ వరకు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ ఐఎఫ్ఎస్‌తో పాటు అటవీ, పోలీసు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

- **కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 24( సమయం న్యూస్):**

సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. ఆధార్, పాన్, బ్యాంక్ వివరాలు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులు, APK ఫైల్స్‌ను తెరవవద్దని తెలిపారు. డిజిటల్ అరెస్ట్, నకిలీ ప్రొఫైల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని ఎస్పీ డి. జానకి సూచించారు. పిల్లల సోషల్ మీడియా వినియోగంపై తల్లిదండ్రులు పర్యవేక్షణ కలిగి ఉండాలని కోరారు.



## ఆర్థిక సహాయం అందజేత

**వలిగొండ అక్టోబర్ 24 (సమయం న్యూస్)**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వర్కట్ పల్లి గ్రామం కాంగ్రెస్ యూత్ ప్రెసిడెంట్ మీసాల, శివాజీ తాత మీసాల పెద్ద నర్సింహా మరణించిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు బీమిడి శైలజ లింగా రెడ్డి సహకారం తో వారి కుటుంబానికి 5000/రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రామ కాంగ్రెస్ నాయకులు వలిగొండ పిఏసిఎస్ డైరెక్టరు బంగారి మహిపాల్, మీసాల యాదేయ్య, కందుకూరి శ్రీకాంత్, మీసాల ప్రసాద్, కందుకూరి వంశీ, మీసాల రామకృష్ణ, పల్లెర్ల,శ్రీకాంత్ , మీసాలా ఈశ్వరయ్య, శివ, బంగారి నర్సింహా, మీసాలా శ్రీను, నరేష్, నవీన్ ,పల్లెర్ల శ్రీను, బంగారి పెద్ద నర్సింహా, కిన్నెరి బిక్షపతి, తది తరులు పాల్గొనడం జరిగింది.



## అర్హులైన పేదలకు 2BHK ఇళ్లు

**హైదరాబాద్, అక్టోబర్ 24( సమయం న్యూస్)**

అర్హులైన పేదలకు 2BHK ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ కలెక్టరేట్‌లో శనివారం లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అర్హత ఆధారంగానే పారదర్శకంగా ఎంపిక జరుగుతోందన్నారు.ప్రతి నియోజకవర్గంలో 5,500 ఇళ్లు నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించామని, బోనాల నాటికి లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. ఎల్‌నినో నేపథ్యంలో ప్రజలు నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని, ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దివ్యాంగులు, అనాథ పిల్లల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు.




## అటవీ సరిహద్దు వివాదాలు పరిష్కరించి రీ సర్వే

**ములుగు, అక్టోబర్ 24( సమయం న్యూస్)**

అటవీ సరిహద్దు వివాదాలను పరిష్కరించి భూముల రీ సర్వేను వేగవంతం చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్ అధికారులను ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో రీ సర్వే పురోగతిపై సమీక్షించిన ఆయన.. రెవెన్యూ, అటవీ శాఖలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. రీ సర్వేకు ముందు రైతులకు సమాచారం అందించాలని, రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. అదనపు రోవర్ పరికరాలు, ప్రత్యేక రీ సర్వే పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**ఆదిలాబాద్, అక్టోబర్ 24( సమయం న్యూస్)**

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు. గత వారం జిల్లాలో 28 సైబర్ ఫిర్యాదులు నమోదయ్యాయని తెలిపారు.ఆన్‌లైన్ మోసాలు, యూపీఐ లావాదేవీలు, నకిలీ పెట్టుబడులు, గిఫ్ట్ ఆఫర్లు, ఫ్రాంచైజీలు, లోన్ యాప్‌ల పేరుతో మోసాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఓటీపీ, యూపీఐ పిన్, బ్యాంకు వివరాలను అపరిచితులకు ఇవ్వవద్దని, గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు కాల్ చేసి cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని ఎస్పీ తెలిపారు.

## మూడు నెలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం

- పూర్తి చేయాలి: మంత్రి తుమ్మల

**ఖమ్మం, అక్టోబర్ 24( సమయం న్యూస్)** వైఎస్ఆర్ కాలనీలోని ఎంపీపీఎస్‌లో రూ.1.30 కోట్లతో నిర్మించనున్న ఐదు అదనపు తరగతి గదుల పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. నాణ్యతతో మూడు నెలల్లో పనులు పూర్తి చేయాలని, ప్రతి 2-3 వారాలకు పురోగతిని సమీక్షించాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో ప్రతి ఇంటికి విద్యుత్ మీటర్, ఇంటి పన్ను ధ్రువీకరణ పత్రాలు అందించాలని, 2023లో మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పెండింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు.



## క్లోరోఫామ్ గ్యాస్ లీకేజీ ఘటనపై టీజీహెచ్ఆర్సీ సుమోటో

**రంగారెడి అక్టోబర్24( సమయం న్యూస్)** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక ప్రాంతంలోని సరకా లేబొరేటరీస్‌లో క్లోరోఫామ్ ఆవిరి లీకేజీ కారణంగా ఇద్దరు కార్మికులు మృతి చెందిన ఘటనను తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్వీకరించింది.పరిశ్రమలో భద్రతా చర్యలు, ఘటనకు దారితీసిన పరిస్థితులు, మృతులు, గాయపడిన కార్మికుల వివరాలు, వారికి అందించిన వైద్య సహాయం, అధికారుల చర్యలపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్ 26.11.2026లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని కమిషన్ ఆదేశించింది.పారిశ్రామిక భద్రత, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ద్వారా హామీ ఇచ్చిన జీవించే హక్కు పరిరక్షణపై కమిషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

## గొల్లపల్లి గ్రామంలో రోడ్డు వెడల్పులో ఇండ్లు పోకుండా చూడాలని

- ఎమ్మెల్యేకు వినతి

**శంషాబాద్ సమయం అక్టోబర్ 24:** హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారి కిషన్ గూడా చౌరస్తా నుండి గొల్లపల్లి గ్రామం మీదగా పెద్ద గోల్కొండ ఔటర్ రింగ్ రోడ్ వరకు 100 ఫీట్ల వెడల్పుతో రోడ్డు వెడల్పు పనులకు ప్రభుత్వం స్వీకారం చుట్టింది. దీంతో శనివారం గొల్లపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను కలిసి వారి బాధలను వివరించారు. 100 ఫీట్ల వెడల్పు రోడ్డుతో గొల్లపల్లి గ్రామంలో భారీ ఎత్తున ఇండ్లు పోతాయని ఎమ్మెల్యేకు తెలియజేశారు. గొల్లపల్లి గ్రామంలో నలభై ఫీట్ల వెడల్పు చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఆయన దృష్టికి తీసుకుపోయారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సంబంధిత అధికారులతో మాట్లాడి గొల్లపల్లి గ్రామస్తులకు నష్టం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెల్యే ని కలిసిన వారిలో చంద్రారెడ్డి, జిట్టే సిద్దులు,ఉన్నారు.



## పార్కును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని

- స్థానికుల డిమాండ్

**శంషాబాద్ సమయం అక్టోబర్ 24** శంషాబాద్ సర్కిల్ పరిధిలోని ఊట్పల్లి శృంగేరి మఠం శారద నగర్ కాలనీలో వెంచర్ ఏర్పాటు చేసిన సమయంలో దాదాపు రెండు వేల గజాల స్థలంలో అద్భుతంగా పార్కు తయారు చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అద్భుతంగా ఉన్న ఈ పార్కు వద్ద ఎంతోమంది సేదతీరే వారని స్థానికుల వివరిస్తున్నారు. స్థానికంగా ఉండే సంగమేశ్వర్ అనే వ్యక్తి తనకు ఇష్టం వచ్చిన విధంగా పార్క్ లో ఉన్న చెట్లను ధ్వంసం చేస్తూ పార్కును పూర్తిగా ప్లాటుగా మరల ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్కులో చెట్లను ధ్వంసం చేసిన సదరు వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక మాజీ ఉపసర్పంచ్ కృష్ణ కుమార్, మల్లేష్ ముదిరాజ్ పలువురు డిమాండ్ చేశారు. పార్కులో చెట్లతో పాటు పార్కును ధ్వంసం చేసిన సదరు వ్యక్తిపై చర్యలు తీసుకొని పార్కును యధాస్థితికి తీసుకురావాలని కోరుతూ శంషాబాద్ సర్కిల్ కార్యాలయంలో, ఫారెస్ట్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



## పోలీసు అమరవీరులకు ఘన నివాళి

- పోలీసు అమరవీరుల త్యాగాలకు కొవ్వొత్తుల నివాళి
- గీసుకొండ ఇన్‌స్పెక్టర్ డి. విశ్వేశ్వర్

**గీసుకొండ, అక్టోబర్ 24 (సమయం న్యూస్)** విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ గీసుకొండ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో శనివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మామునూరు ఏసీపీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు.గీసుకొండ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి.విశ్వేశ్వర్, ఎస్ఐ రవి, పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు కలిపి సుమారు 150 మంది ర్యాలీలో పాల్గొన్నారు. గొర్రెకుంటలో ప్రారంభమైన ర్యాలీ జాన్‌పీర్ల మీదుగా సాగి గొర్రెకుంట క్రాస్ వద్ద ముగిసింది.దేశ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధులు నిర్వహిస్తూ ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలు చిరస్మరణీయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. వారి త్యాగస్ఫూర్తిని స్మరించుకుంటూ ప్రజల రక్షణకు పోలీసుశాఖ నిరంతరం కట్టుబడి ఉంటుందని తెలిపారు.




## భూ రీసర్వే పనులు వేగవంతం

**పెద్దపల్లి, అక్టోబర్ 24( సమయం న్యూస్)** భూ రీసర్వే మొదటి దశలో ఎంపిక చేసిన 70 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.అవసరమైన అదనపు బృందాలు, సిబ్బంది, యంత్ర పరికరాలు, సాంకేతిక సదుపాయాలు సమకూర్చుకొని పనుల్లో వేగం పెంచాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి, గ్రామాల వారీగా పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు.సర్వే ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు.

## కరువును ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు

- నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి.. గ్రామసభల్లో అధికారుల సూచనలు

**ఆలేరు, అక్టోబర్ 24(సమయం న్యూస్):** ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రానున్న కరువును ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ఆలేరు మండలంలోని మందనపల్లి, శారాజీపేట, తూర్పుగూడెం గ్రామాల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అవసరమైన వనరులను గుర్తించి, గ్రామస్థాయిలో



కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులు సూచించారు. నీటి వృథాను అరికట్టి, పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు, గ్రామాల్లో సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించడంతోపాటు బోరుబావుల రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. పశువులకు నీటి తొట్లు, షెడ్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వివిజి రామ్ జీ పనుల్లో కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని, అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, తహసీల్దార్ ఆంజనేయులు,పశువైద్యాధికారి డాక్టర్ చైతన్య, ఏపీవో ఎన్. అరుణకుమారి, ఐబీ ఏఈ శివాని, ఏవో శ్రీనివాస్, ఏఈవోలు, టీఏ మానస, ఆయా గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ ఉద్యోగులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సాధన సొసైటీ మానసిక దివ్యాంగుల ఆశ్రమాన్ని సందర్శించిన

- సీనియర్ సివిల్ జడ్జి. సబిత

**వలిగొండ అక్టోబర్ 24 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం టేకులసోమారం గ్రామంలో ఉన్న సాధన సొసైటీ మానసిక దివ్యాంగుల ఆశ్రమాన్ని రామన్నపేట మండల న్యాయ సేవా కమిటీ ఛైర్మన్ మరియు సీనియర్ సివిల్ జడ్జి జి. సబిత సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వహణాధికారులతో మాట్లాడి, ఆశ్రమంలో నివసిస్తున్న వారి జీవన పరిస్థితులు, వారికి అందిస్తున్న సంరక్షణ, సౌకర్యాలు మరియు సంక్షేమ కార్యక్రమాల గురించి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా దివ్యాంగుల పట్ల గౌరవం, మానవీయ దృక్పథం కలిగి ఉండటంతో పాటు, వారి హక్కుల పరిరక్షణకు మరియు సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని ఆమె వివరించారు. సమాజంలోని బలహీన వర్గాలకు న్యాయ సహాయం అందించడం, వారి హక్కులపై అవగాహన కల్పించడం వంటి అంశాలలో న్యాయ సేవా సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.సమాజంలోని అణగారిన మరియు బలహీన వర్గాల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన దిశగా మండల న్యాయ సేవా కమిటీ, రామన్నపేట తన



కృషిని కొనసాగిస్తుందని ఈ సందర్శన తెలియజేస్తోంది.

## సంగారెడ్డి జిల్లాలో స్కౌట్ మాస్టర్లు, గైడ్

- కెప్టెన్లకు ఈనెల 25 నుండి శిక్షణ శిబిరాలు
- శిక్షణ ప్రోగ్రాం పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి సమయం న్యూస్ సంగారెడ్డి, అక్టోబర్ 24** సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి గ్రామంలోని తెలంగాణ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల (TGRS & JC)లో స్కౌట్



మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు రాష్ట్రస్థాయి శిక్షణాధికారులచే ఈనెల 25 నుండి బేసిక్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నట్లు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి వి. మాధవరెడ్డి తెలిపారు. మొదటి విడత శిక్షణ శిబిరం అక్టోబర్ 25 నుంచి 31 వరకు, రెండవ విడత శిక్షణ శిబిరం నవంబర్ 1 నుంచి 7 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి, రెండవ విడతలలో వివిధ జిల్లాలకు చెందిన స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు పాల్గొననున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, అదనపు కలెక్టర్ పాండు బేసిక్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రెజరర్ జి. సుందర్ రావు జిల్లా కార్యదర్శి వి. మాధవరెడ్డి, జాయింట్ సెక్రటరీ ఎం. శోభ, జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్లు చంద్రశేఖర్ గౌడ్, వందన, తదితరులు పాల్గొన్నారు

## పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

- సందర్భంగా వ్యాసరచన పోటీలు
- విజేతలకు ఎగ్జామ్ ప్యాడ్లు: పాల్గొన్న విద్యార్థులందరికీ పెన్నుల పంపిణీ

**ఆలేరు, అక్టోబరు 24(సమయం న్యూస్)** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆలేరు పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీసు అమరవీరుల త్యాగాలు, దేశం కోసం వారు చేసిన సేవలు, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు ఎగ్జామ్ ప్యాడ్లను బహుమతులుగా అందజేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రోత్సాహకంగా పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజం పట్ల బాధ్యత కలిగి



ఉండాలని, దేశాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని సూచించారు.జిల్లా ఎస్పీ సూచనల మేరకు కార్యక్రమాన్ని నిర్వహించిన ఆలేరు పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎస్ హెచ్ ఓ ఉదయకిరణ్, మండల విద్యాధికారి ఎర్ర లక్ష్మి, ఫ్రెండ్స్ క్లబ్ అధ్యక్షుడు పూల్ నాగయ్య తదితరులున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాల పట్ల గౌరవభావాన్ని పెంపొందించే ప్రయత్నం చేశారు.

## అధికారులుసమన్వయంతో గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

**రాయపోల్.అక్టోబర్ 24...(సమయం న్యూస్)** అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు సాగి గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలమండల ప్రత్యేక అధికారి బాబు నాయక్ అధికారులకు సూచించారు. శనివారం సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు. వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని. సర్పంచులు. అధికారులు సమన్వయంతో ఉండి సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం మంచినీటి సమస్య. విద్యుత్ సమస్య తదితర వాటిని ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి పరిష్కరించే విధంగా చూడాలని సూచించారు. కళ్యాణ లక్ష్మి దరఖాస్తులు తీసుకుంటున్నారని వాటికి డబ్బులు ఇస్తారా లేదా అని చిన్న మాసంపల్లి సర్పంచ్ రేకుల నరసింహారెడ్డి కోరగా అందుకు తాసిల్దార్ సమాధానం ఇస్తూ కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ దరఖాస్తులు తీసుకుంటున్నామని వెంటనే అప్లోడ్ చేసి ఆర్డిఓ ఆఫీస్ కు పంపించడం జరుగుతుందని ఎవరైనా అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న వారికి వెంట వెంటనే బిల్లులు చెల్లించాలని పలు గ్రామాల సర్పంచులు సమావేశంలో ప్రస్తావించగా గృహ నిర్మాణ శాఖ ఏఈ



సమాధానం ఇస్తూ ఇల్లు నిర్మించుకున్న వారికి వెంటనే బిల్లు చెల్లించే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. వానాకాలం పంటల సాగుకు తగినంత యూరియా అందించడం లేదని పలు గ్రామాల సర్పంచ్ లు ఏవో నరేష్ దృష్టికి తీసుకురాగా ఆయన సమాధానం ఇస్తూ యాప్ ద్వారా రైతులకు అవసరకు అందించడం జరిగిందని. యాసంగి సాగు కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల మండల గ్రామస్థాయి అధికారులు అందుబాటులో ఉండి చిత్తశుద్ధితో సమస్యను పరిష్కరించాలని మండల ప్రత్యేక అధికారి బాబు నాయక్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో నరేందర్ రెడ్డి. వైద్యాధికారిమహారాజు. ఏపీఎం యాదగిరి. ఐసిడిఎస్ సూపర్వైజర్ షబానా. పంచాయతీరాజ్ ఏఈ. ఆర్ అండ్ బి . ఎక్సైజ్. ఆర్టీసీ. ఫారెస్ట్ అధికారులతో పాటు మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు రేకుల నర్సింహారెడ్డి మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## ఎండిపోతున్న వరి పంటలు

- తల్లడిల్లుతున్న రైతులు
- జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించిన
- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**వెల్దుర్తి,అక్టోబర్ 24,** మాసాయిపేట్ మండలంలో విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండిపోతుండటంతో రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించిన నర్సాపూర్ శాసన సభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి. మాసాయిపేటలో విద్యుత్ సరఫరా లేక ఎండిపోయిన పంటలను శనివారం బి ఆర్ ఎస్ నాయకులు రైతులతో కలిసి పరిశీలించి, బాధిత రైతులను పరామర్శించిన నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి. అనంతరం వారు మాట్లాడుతూ. రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్



అందించి, పంటలను కాపాడాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను, పంట నష్టానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఎడాపెడా విద్యుత్ కోతలు విధిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల జీవితాలతో ఆడుకుంటోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోతుండటంతో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం రైతులతో కలిసి జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పంట ఎండిపోయిన రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి నాయకుడు నాగరాజ్, బాలేష్,డి శ్రీనివాస్,రైతులు, తదితరులు పాల్గొన్నారు